ఆధార్ అనుసంధానం చేసుకోండి : ఏడీ

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కళాశాలలో పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు (ఆర్‌టిఎఫ్-ఎంటిఎఫ్) అర్హులైన ఎస్సీ విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని సాంఘిక శాఖ ఏడీ కె.తులసీ దేవి తెలిపారు. బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ లేకపోవడం వల్ల జిల్లాలో 263 మంది ఎస్సీ విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉందన్నారు. త్వరితగతిన ఆధార్ లింక్ చేసుకోవాలని సూచించారు.

శ్రీగిరిపై శివోహం



శ్రీశైలం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నమైంది. స్వామివారికి అత్యంత ఇష్టమైన శివరాత్రి ఉత్సవాలు బుధవారం నుంచి ఆరంభం కానున్నాయి. శివమాలధారులు, సాధారణ భక్తులు ఇప్పటికే వేలాదిగా శ్రీశైలానికి చేరుకుంటున్నారు. శ్రీశైలం మహాక్షేత్రంలో బుధవారం నుంచి మార్చి ఒకటో తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను దేవస్థానం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. భక్తుల సౌకర్యాలకు ఎటువంటి అంతరాయం కలుగకుండా ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో అన్ని ఆర్జిత సేవలను నిలుపుదల చేశారు. ఉత్సవాల సందర్భంగా 23వ తేదీ వరకు జోతిర్ముడి కలిగిన భక్తులకు మాత్రమే నిర్ణీత వేళలో స్వామివారి స్పర్శదర్శనం కల్పించనున్నారు. అదేవిధంగా ప్రముఖులకు 4 విడతలుగా విరామ వేళల్లో దర్శనం కల్పిస్తారు. ఉదయం 6:30 నుంచి 7:30 వరకు, 10:30 నుంచి 11 వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి 3 గంటల వరకు రాత్రి 7 నుంచి 7:30 వరకు ప్రముఖులకు దర్శనం కల్పిస్తారు.

క్యూలైన్లు ఇలా...

భక్తుల సౌకర్యార్థం ఉచిత దర్శనం రథశాల నుంచి క్యూలైన్ల వరకు, ఉచిత స్పర్శ దర్శనం క్యూకాంప్లెక్స్ నుంచి ఆలయ ప్రవేశ ద్వారం వరకు శీఘ్రదర్శనం లలితాంబికా కాంప్లెక్స్ ముందు భాగం నుంచి ఏర్పాటు చేశారు. అతిశీఘ్రదర్శనం (రూ.500) క్యాంపు కోర్టు నుంచి క్యూలైన్ల వరకు ఏర్పాటు చేశారు. శివదీక్షా పరులకు ఆలయ ఉత్తర భాగాన చంద్రావతి కల్యాణ మండపం నుంచి ప్రతేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

నేడు యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం

శ్రీగిరిపై మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం యాగశాల ప్రవేశంతో ప్రారంభమవుతాయి. పదకొండు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు వివిధ సేవలు నిర్వహిస్తారు. తొలిరోజున సాయంత్రం ధ్వజారోహణం, భేరిపూజ, ధ్వజపటం ఆవిష్కరణ చేసి సకల దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తారు. తర్వాతి రోజు నుంచి స్వామి అమ్మవార్లకు రోజుకో వాహనసేవ, అమ్మవారికి ప్రతేక అలంకారంతో ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు. మహా శివరాత్రి రోజున సాయంత్రం స్వామిఅమ్మవార్లకు ప్రభోత్సవం, రాత్రి లింగోద్భవ సమయంలో మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఇదే సమయంలో కీలకఘట్టం స్వామివారి ఆలయానికి పాగాలంకరణ కార్యక్రమం కూడా జరుగుతుంది. ఈ సమయంలో ప్రధాన ఆలయం లోపల విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. లింగోద్భవ కార్యక్రమం అనంతరం స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. మరుసటి రోజు రథోత్సవం, తెప్పోత్సవం నిర్వహిస్తారు. పదో రోజు యాగపూర్ణాహుతి, సదస్యం, నాగవల్లి, ఆస్థానసేవ, సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించి, చివరిరోజు అశ్వవాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవంతో ఉత్సవాలను ముగిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు.

పట్టు వస్త్రాల సమర్పణ

బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లకు వివిధ దేవస్థానాల నుంచి పట్టు వస్త్రాలను అందజేస్తారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన మొదటి రోజు శ్రీకాళహస్తీశ్వర ఆలయం, 20న ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయం, 21న విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం, 22వ తేదీ ఉదయం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం, సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు అందజేస్తారు. కాగా ఈ నెల 23వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

- నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- అన్ని ఆర్జిత సేవలు నిలుపుదల
- 23న పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం
- 26న కీలకఘట్టం.. పాగాలంకరణ
- మార్చి1తో ఉత్సవాల ముగింపు
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు





ఉత్సవాలు ఇలా..

19వ తేదీ :	ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం
20వ తేదీ :	భృంగివాహనసేవ
21వ తేదీ :	హంసవాహనసేవ
22వ తేదీ :	మయూర వాహనసేవ
23వ తేదీ :	రావణ వాహనసేవ
24వ తేదీ :	పుష్పపల్లకీ సేవ
25వ తేదీ :	గజవాహనసేవ
26వ తేదీ :	మహాశివరాత్రి, పాగాలంకరణ, కల్యాణోత్సవం
27వ తేదీ :	రథోత్సవం, తెప్పోత్సవం
28వ తేదీ :	యాగపూర్ణాహుతి, ధ్వజావరోహణ
మార్చి 1 :	అశ్వవాహనసేవ, పుష్పోత్సవం

భక్తులకు సౌకర్యవంతమైన ఏర్పాట్లు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ఈ నేపథ్యంలో దేవస్థానం, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేశాం. పాదయాత్రగా అటవీ మార్గాన శ్రీశైలం దర్శనానికి విచ్చేసే భక్తులకు ప్రత్యేకంగా తాగునీరు, అన్నదానం, సేదతీరేందుకు చలువ పందిర్లను, 10 చోట్ల వైద్యశిబిరాలను ఏర్పాటు చేశాం. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం అందించేందుకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశాం. భక్తులకు మంచినీరు, అల్పాహారం అందజేస్తాం. లడ్డూ ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద ఎక్కువ సమయం వేచివుండకుండా 15 శాశ్వత కౌంటర్లు, అదనంగా అన్నప్రసాద వితరణ వద్దద 4, గణేష సదనం వద్ద 2, సీఆర్వో కార్యాలయం వద్ద 2 అదనపు ప్రసాద విక్రయకేంద్రాలు ఏర్పాటు చేశాం. భక్తులకు ఉచిత లడ్డు, వాటర్ బాటిల్ అందజేస్తాం.

- ఎం.శ్రీనివాసరావు, ఆలయ ఈఓ

రాష్ట్రాభివృద్ధికి టీడీపీ పని చేస్తుంది

- జిల్లా రోడ్లను జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తాం
- రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పత్తికొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి టీడీపీ పనిచేస్తుందని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. పత్తికొండ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల అనాలోచిత పాలన వల్ల రాష్ట్రంలో అభివృద్ధి అథోగతిపాలైందని అన్నారు. రాష్ట్రానికి జీవనది పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంలో విఫలమైందని అన్నారు. టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే పోలవరం పూర్తి చేసి, ఆ జలాలను అన్ని ప్రాంతాలకు అందించేలా పనులను చేపట్టిందన్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు ఒక్క కిలోమీటర్ కూడా రహదారుల నిర్మాణం చేపట్టలేదని, 47వేల కిలోమీటర్ల రహదారులను నిర్మాలించలేదని ప్రచారం చేసుకున్నారన్నారు. ఎన్‌డీబీ కింద జరిగిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎందరో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ చెల్లించకుండా వదిలేసిన ఎన్‌డీబీ బిల్లులు రూ.1500 కోట్ల మేర చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకున్నామన్నారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో రవాణా సౌకర్యం లేక ఫ్యాక్టరీలు పక్కరాష్ట్రాలకు వలస పోయాయన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక కర్నూలు జిల్లాలో 802 కిలోమీటర్ల మేర రహదారుల మరమ్మతులకు రూ. 21 కోట్ల నిధులు విడుదల చేశామన్నారు. 97 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. పీపీటీ విధానం ద్వారా రహదారులను ఆధునికీకరించేందుకు సిద్ధమవుతున్నామని, అందుకోసం ఫేజ్-1 కింద 1300 కిలోమీటర్లు, ఫేజ్-2 కింద 1700 కిలోమీటర్లు రహదారులు వేసేందుకు ప్రణాళికలు పూర్తి చేయడంతోపాటు డీపీఆర్ కింద రూ.37 కోట్లు నిధులు విడుదల చేశామన్నారు.

వీఆర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లు

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆదోని సబ్ డివిజన్ పరిధిలోని కౌతాళం పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు శివనాయక్, పులిరాజులను వీఆర్‌కు పంపిస్తూ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఉత్వర్వులు జారీ చేశారు. వీరిద్దరిపై ఇటీవల ఆరోపణలు రావడంతో విచారించిన ఎస్పీ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆదోని పట్టణానికి చెందిన ఓ సీఐ మీద ఆరోపణలు రావడంతో ఆయన్ను కూడా వీఆర్‌కు పంపినట్లు తెలిసింది. ఈయనను విచారణ నిమితం హెడ్ క్వార్టర్‌కు రావాలని ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం.

రిజిస్ట్రేషన్ శాఖ డీఆర్‌గా జానకి దేవి



కర్నూలు జిల్లా డీఆర్‌గా బాధ్యతలు చేపట్టిన జానకిదేవి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు

కల్లూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా సీహెచ్.జానకిదేవి నియామకమయ్యారు. ప్రస్తుత డీఆర్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. దీంతో జానకిదేవిని డీఆర్‌గా నియమిస్తూ డీఐజీ పీజీఎస్.కళ్యాణి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆమె పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కల్లూరు, కర్నూలు సబ్ రిజిస్ట్రార్లు శ్రీనివాసులు, వరప్రసాద్ డీఆర్‌కు ఘనస్వాగతం పలికి మర్యాదపూర్వకంగా కలిశారు. రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాలకు వచ్చే వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా ఉద్యోగులు పనిచేయాలని డీఆర్ సూచించారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నేతల ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు బైఠాయించి థాళిభజావో పేరుతో నిరసన కార్యక్రమంలో చేపట్టారు. పేట్లు, గరిటలతో శబ్దం చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. వెంటనే సూపర్‌సిక్స్ పథకాలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు, నాయకులు కాశీంవలి, క్రాంతి నాయుడు, లక్ష్మీనారాయణ, బతుకన్న, బజారన్న, షేక్ ఖాజా హుశేన్, రాఘవేంద్రరెడ్డి, ఎస్.ప్రమీల, వెంకట సుజాత, సుంకన్న, లాజరస్, అనంతరత్నం తదితరులు పాల్గొన్నారు.

మాలలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

రాష్ట్ర మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయ్ కుమార్



మాట్లాడుతున్న ఛైర్మన్ విజయ్ కుమార్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే వివిధ పథకాలను వినియోగించుకొని మాలలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని రాష్ట్ర మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా మంగళవారం స్థానిక ఎస్‌వి కాంప్లెక్స్‌లోని మీటింగ్ హాల్‌లో మాల రాజకీయ నాయకులతో, ప్రముఖులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించిన రూ. 50 వేల కోట్ల ఆస్తులు అన్యాక్రాంతం ఆయ్యాయన్నారు. వాటిపై విస్తృత సమావేశం నిర్వహించి చర్చించుకుందామన్నారు. ఆస్తుల పరిరక్షణకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. జిఎస్‌టిలు, టిడిఎస్‌లు చెల్లించి, ఆర్థిక రంగంలో మాలలు భాగస్వాములు కావాలని అన్నారు. ఈసారి కార్పొరేషన్ ద్వారా గొర్రెలు, బర్రెల పథకాలు కాకుండా, మాలల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేలా పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మాల నాయకుడు అశోక్‌రత్నం మాట్లాడుతూ మాలల కార్పొరేషన్ ఏర్పాటు శుభ పరిణామమని, రొటీన్ పథకాలు కాకుండా, ఆర్థికంగా ఎదగడానికి పరిశ్రమలను ఏర్పాటు చేయాలని అన్నారు. బ్యాంకు ష్యూరిటీ లేకుండా కోటి రూపాయల వరకు రుణాలు ఇప్పించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ సమస్యలో జిల్లాను యూనిట్‌గా తీసుకోవడానికి వీలు లేదన్నారు. దామాషా ప్రకారం మాలలకు రావాలసిన వాటా పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవి కుమార్ మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా అర్హులైన మాలలందరూ లబ్ధి పొందేలాగా చూడాలన్నారు. మరో నాయకుడు త్యాగరాజు మాట్లాడుతూ నిరుద్యోగ నిర్మూలన కోసం యువతకు ఆధునిక టెక్నాలజీతో కూడిన పథకాలను అందించాలన్నారు. కర్నూలు జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలన్నారు. ఈ సమావేశంలో మాల సంఘం నాయకులు కే. వెంకటేష్, రాజీవ్ కుమార్, జనసేన ఎస్సీ సెల్ నాయకులు నాగరాజు తదితరలు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

నల్ల బ్యాడ్జీలతో పోస్టల్ ఉద్యోగుల నిరసన

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని తపాలా శాఖ ఉద్యోగుల యూనియన్ పీ4 రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కే. ఈశ్వరయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నాలుగు ప్రధాన తపాలా ఉద్యోగ సంఘాలు ఎన్ఈపీఈ, ఎఫ్ఎన్‌పీఓ, ఎన్‌యూజీడీఎస్, ఏఐజీఎస్‌యూల అధ్వర్యంలో మంగళవారం ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ తపాలా శాఖను ప్రైవేటుపరం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ చర్యలను ఎండగట్టాలన్నారు. ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చకపోతే దేశవ్యాప్త నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్‌పీఈ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం. మహ్మద్ జానీ, పి3 జిల్లా కార్యదర్శి గిరిబాబు, పీ4 జిల్లా కార్యదర్శి ఏ. శమంతకరెడ్డి, సుమంత్, శివకుమార్ రెడ్డి, బి. లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆస్పరి పోలీసు స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ

ఆస్పరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఆస్పరి పోలీసు స్టేషన్‌లో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పటేల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని కోరారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలను అప్రమత్తంగా చేయాలని సూచించారు. రాత్రిపూట గస్తీ బాగా పెంచాలని కోరారు. వివిధ నేరాలలో పట్టుబడిన వాహనాలను కోర్టుకు హాజరుపరిచి వదిలివేయాలని సూచించారు. లా అండ్ ఆర్డర్ అంశాలపై యువత, విద్యార్థులు, ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించారు. ఆయన వెంట సీఐ మస్తాన్ వలి, ఎస్సై నరసింహులు పాల్గొన్నారు...

ఆర్‌యూ వీసీగా డాక్టర్ వి.వెంకట బసవరావు



కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతిగా డాక్టర్ వి. వెంకట బసవరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం నూతన ఉపకులపతిగా ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు. మంగళగిరికి చెందిన ఆయన రెండు తెలుగురాష్ట్రాల్లోని పలు యూనివర్సిటీల్లో ప్రొఫెసర్‌గా పని చేశారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో సీనియర్ ప్రొఫెసర్‌గా కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తూ గత జూలై 31 పదవీ విరమణ చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఆయనను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోనా శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇన్‌చార్జి ఉపకులపతిగా పని చేసిన ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఉపకులపతిగా తానే మళ్లీ వర్శిటీకి రాబోతున్నారనే ప్రచారం గత రెండు నెలలుగా జరిగింది. ప్రభుత్వ ఉత్తర్వులు చూసిన పలువురు ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి రెగ్యులర్ ఉపకులపతి నియామకంపై ఎలాంటి ప్రకటన రాకపోవడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం ఇన్‌చార్జి ఉపకులపతిగా ప్రొఫెసర్ పీఎస్ షావలీ ఖాన్‌ను కొనసాగనున్నట్లు తెలిసింది.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు యాగంటి ముస్తాబు


యాగంటి ఆలయ వ్యూ


యాగంటి బసవన్న


ఆలయ పుష్కరిణి

బనగానపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్రం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఈ నెల 25 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో చంద్రుడు, టీడీపీ యువ నాయకుడు మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. మార్చి 1వ తేదీ వరకు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ నెల 25న మంగళవారం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. తొలి రోజు ఉదయం 5 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, సహస్ర నామావళి కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26న బుధవారం రాత్రి 12 గంటలకు లింగోద్భవ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 27న గురువారం తెల్లవారు జామున 4.30 గంటలకు ఉమా మహేశ్వరస్వామి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 28న శుక్రవారం నందికోల ఉత్సవం, రథోత్సవం ఉంటాయన్నారు. నంద్యాల వారిచే కోలన్న కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 1వ తేదీ శనివారం శివదీక్ష విరమణ, పూర్ణాహుతి, నాగవల్లి, వసంతోత్సవం, తెప్పోత్సవం కార్యక్రమాలతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు, షామియానాలు, తాగునీరు. 24 గంటలు విద్యుత్ సౌకర్యం ఉండేలా అధికారులతో సమన్వయం చేస్తున్నాం. శ్యానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం. పెద్ద కోనేరు వద్ద మహిళలకు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక వసతి, భక్తులకు అందుబాటులో లడ్డూప్రసాదాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. పోలీసుల సహకారంతో శాంతి భద్రతలకు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నాం

- ఆలయ ఈవో చంద్రుడు


యాగంటి ఉమామహేశ్వరులు


యాగంటి ఆలయ గోపురం

భళా బసవన్నా...

- కోసిగిలో ఘనంగా ఎద్దుల బలప్రదర్శన పోటీలు


రాతిదూలం లాగుతున్న వృషభాలు

కోసిగి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో రేణుకా ఎల్లమ్మ రథోత్సవం సందర్భంగా ఎద్దుల బలప్రదర్శన పోటీలు ఘనంగా జరుగుతున్నాయి. కోసిగిలోని 3వ వార్డు బుగేని చెరువు సమీపంలో నియోజకవర్గ స్థాయి గిరక (రాతిదూలం లాగుడు) పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాలుగు మండలాల నుంచి సుమారు 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి

- కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్


మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్

కోసిగి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కోసిగి సర్కిల్ స్టేషన్ పరిధిలోని కోసిగి, పెద్దకడుబూరు మండలాల్లో నాయకులు ఫ్యాక్షన్‌ను వీడి పిల్లలను చదివించుకుని అభివృద్ధి పథంలో ముందుకు నడవాలని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. మంగళవారం కోసిగి సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ మండలంలో ప్రజలు ఫ్యాక్షన్ వీడి ఇప్పుడిప్పుడే అభివృద్ధిలో కోసిగి నడుస్తుందని, అందులో భాగంగానే సోమవారం జరిగిన కోసిగి రేణుకా ఎల్లమ్మ రథోత్సవం ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరిగిందన్నారు. డీఐజీ వెంట ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ ఉన్నారు.

మార్చి 1 నుంచి గురు వైభవోత్సవాలు

- 2025 అవార్డులకు ప్రముఖుల ఎంపిక
- 6న 430వ జన్మదిన వేడుకలు



మంత్రాలయం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి గురుభక్తి ఉత్సవాలు మార్చి ఒకటో తేదీ నుంచి నిర్వహించేందుకు మఠం అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. మార్చి ఒకటో తేదీన 404వ పట్టాభిషేకం, ఆరో తేదీన 430వ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, సురేష్‌కోణాపూర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడారు. గురువైభవోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే రాఘవేంద్ర గురు వైభవోత్సవ-2025 అవార్డులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో ప్రముఖులను ఎంపిక చేసినట్లు తెలిపారు. న్యాయ, ఆర్థిక, రాజకీయ, సాంకేతిక, విద్య, వైద్య, చిత్ర పరిశ్రమ, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య పాండిత్యంలో విశేష ప్రతిభ కనబరిచిన వారిని అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో మద్రాసు, ఉత్తరఖండ్ హైకోర్టు చీఫ్‌జడ్జిలు జస్టిస్ కేఆర్ శ్రీరామ్, నరేంద్ర, మద్రాస్, తెలంగాణ హైకోర్టు జడ్జిలు జస్టిస్ సుబ్రమణియన్, శ్రీసుధ, బెంగుళూరు సీబీఐ కోర్టు జిల్లా జడ్జి హెచ్‌ఏ మోహన్, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర రైల్వే శాఖమంత్రి వి. సోమన్న, కేంద్ర కార్మిక శాఖమంత్రి శోభకరంద్లాజే, ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖమంత్రి నారా లోకేశ్, దేవదాయ శాఖమంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్, కర్ణాటక మైనర్ ఇరిగేషన్ శాఖమంత్రి ఎన్‌ఎస్ బోసురాజు, రాజ్యసభ సభ్యులు లెహర్ సింగ్ సిరోయ, బళ్లారి ఎంపీ తుకారాం, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ) మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఏపీ సీఎం సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న ఉన్నారు. వీరితో పాటు టీటీడీ ఈఓ శ్యామలరావు, కర్ణాటక ఎండోమెంట్ కమిషనర్ ఎంవీ వెంకటేష్, కర్నూలు డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఏపీ ఇంటెలిజెన్స్ ఎస్పీ పక్కీరప్ప, బళ్లారి ఎస్పీ శోభారాణి, టీటీడీ ఏఈఓ వెంకయ్య చౌదరి, కడప విద్వాన్ ఇంద్రకంటి ప్రసాదశర్మ, బళ్లారి పంచాంగ కర్త ప్రొఫెసర్ గురురాజ్ కులకర్ణి, బెంగుళూరు పూర్ణప్రజ్ఞ విద్వాన్ కేశవాచార్య, పూణే గురురాజ్ కులకర్ణి, ఏపీ బీజేపీరాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, టీటీడీ సభ్యులు నరేష్ కుమార్, బెంగుళూరు డాక్టర్ నాగరాజ్‌శెట్టిలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు చేతుల మీదుగా నగదు, ప్రశంస పత్రం, అవార్డు, శేష వస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కరిస్తారు. వచ్చే నెల 1వ తేదీ నుంచీ 6వ తేదీ వరకు యోగీంద్ర కళా మంటపంలో ఈ అవార్డుల ప్రదానం జరుగుతుంది.

ఎన్టీఆర్ సుజల స్రవంతికి కొత్త కళ

- వైసీపీ హయాంలో మూతబడిన పథకం
- రూ.4 లక్షల నిధులతో మరమ్మతులు
- నేడు పథకం పునః ప్రారంభించనున్న మంత్రి బీసీ

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ఎట్టకేలకు కొత్త కళ సంతరించుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పథకంపై పగబట్టి కక్ష పూరితంగా మూతబడేలా చేశారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు శుద్ధ జలం అందక ఫ్లోరైడ్ నీటిని తాగే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తాగునీటి పథకాన్ని తిరిగి పునరుద్ధరించడానికి మంత్రి బీసీ జనార్దనరెడ్డి చకచకా చర్యలు చేపట్టారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని తిరిగి ప్రజలకు అంకితం చేయడానికి బుధవారం మంత్రి బీసీ జనార్దనరెడ్డి కొలిమిగుండ్లకు రానున్నాడు. కొలిమిగుండ్ల మండల ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించడమే ప్రధాన ధ్యేయంగా ప్రస్తుత మంత్రి, అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డి 2015లో రూ.3.79 కోట్ల నిధులతో సుజల స్రవంతి పథకాన్ని మండల ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. కొలిమిగుండ్లలో 10వేల లీటర్ల సామర్థ్యంతో మదర్ ప్లాంటును ఏర్పాటు చేసి, గ్రామాల్లో మినీ వాటర్ ట్యాంకులకు శుద్ధ జలాన్ని సరఫరా చేశారు. ఇందుకోసం ఆరు ట్యాంకర్ ట్రాక్టర్లు నిరంతరం మదర్ ప్లాంటు నుండి మినీ ట్యాంకులకు నీరు సరఫరా చేసి, ప్రజలను ఆదుకున్నారు. అయితే 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజల స్రవంతిపై పగబట్టింది. ఎలాగైనా ఆ పథకం ఆశయాన్ని నీరుగార్చాలని వైఎస్ఆర్ సుజల స్రవంతి పథకంగా పేరు మార్చారు. అనంతరం ఏడాది కూడా గడవక ముందే ఈ పథకం నడవడానికి కనీస నిధులు కేటాయించకుండా నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో పథకం మూతపడింది. ఫలితంగా 21 గ్రామాల్లో శుద్ధ జలం ప్రజలకు అందకుండా పోయింది. వైసీపీ హయాంలో ప్రజలు అనేక గ్రామాల్లో ఫ్లోరైడ్ నీటినే తాగాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే మంత్రి బీసీ ఈ పథకం మీద ప్రత్యేక దృష్టి సారించారు. రూ.4 లక్షల నిధులు కేటాయించి, మదర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించారు. సమస్యలను అధిగమించి, తిరిగి శుద్ధ జలం సరఫరాకు చర్యలు తీసుకోవడంతో మంత్రి బీసీ జనార్దనరెడ్డికి పలువురు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం మంత్రి నాలుగు గ్రామాలకు నీటి సరఫరా ప్రారంభించనున్నారు. త్వరలోనే అన్ని గ్రామాలకు శుద్ధ జలాన్ని సరఫరా చేయనున్నారు.


ప్రారంభానికి సిద్ధమైన ఎన్టీఆర్ సుజల స్రవంతి మదర్ ప్లాంట్


నీటి సరఫరాకు సిద్ధమైన ట్రాక్టర్లు

ఎంతో సంతోషంగా ఉంది



సుజల స్రవంతి పథకం తిరిగి ప్రారంభించడం సంతోషంగా ఉంది. అంకిరెడ్డిపల్లెలో శుద్ధ జలం కొరత దీంతో తీరనుంది.

-రవిప్రకాశ్‌రెడ్డి, అంకిరెడ్డిపల్లె

అన్ని గ్రామాలకు శుద్ధ జలం అందించాలి



అనేక గ్రామాల్లో శుద్ధ జల కేంద్రాలు లేవు. సుజల స్రవంతి నుంచి అన్ని ఊళ్లకు శుద్ధ జలం అందించాలి.

-బోయ రవి, కొలిమిగుండ్ల

రాజకీయ కురువృద్ధుల కలయిక

సుదీర్ఘకాలం తర్వాత కలిసిన మాజీ మంత్రులు కేఈ కృష్ణమూర్తి, ఎస్వీ సుబ్బారెడ్డి


ఎస్వీ సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న కేఈ కృష్ణమూర్తి

పత్తికొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ రాజకీయాల్లో కురువృద్ధులు. ఇద్దరూ మంత్రులుగా పనిచేసిన వాళ్లే. ఒకసారి కాదు పలుమార్లు క్యాబినేట్ మంత్రులుగా పనిచేసి రాజకీయ ఉద్ధండులుగా పేరొందారు. వారెవరో కాదు.. మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి. జిల్లా రాజకీయాలను శాశించిన ఆ ఇద్దరూ వయోభారంతో ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. మంగళవారం పత్తికొండలో ఆ ఇద్దరూ భేటీ కావడం ఆసక్తిగా మారింది. పత్తికొండలో జరుగుతున్న కేఈ మాదన్న స్మారక క్రికెట్ పోటీలను తిలకించేందుకు మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి వచ్చారు. మాజీమంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి పత్తికొండలో కుమార్తె నాగరత్నమ్మ ఇంట్లో ఉన్నట్లు తెలుసుకున్న కృష్ణమూర్తి అక్కడకు వెళ్లారు. ఈ సందర్భంగా రాజకీయ స్మృతులను గుర్తు చేసుకుంటూ సరదాగా మాట్లాడున్నారు. ఆరోగ్యం, ఆహారపు అలవాట్ల గురించి ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. కేఈ కృష్ణమూర్తి తొలుత ఎన్టీఆర్, తర్వాత చంద్రబాబు నాయుడు క్యాబినేట్‌లో మంత్రిగా పనిచేశారు. అదేవిధంగా ఎస్వీ సుబ్బారెడ్డి సైతం చంద్రబాబు సారథ్యంలో మంత్రిగా పనిచేశారు. కేఈ కృష్ణమూర్తి టీడీపీలో ఉండగా, ఎస్వీ సుబ్బారెడ్డి మాత్రం రాజకీయాలకు దూరంగా ఉన్నాడు. ఆయన కుమారుడు ఎస్వీ మోహన్ రెడ్డి ప్రస్తుతం కర్నూలు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు లోబడి తవ్వకాలు

- ఆర్డీఓ భరత్ కుమార్
- బంగారు నిక్షేపాలపై ప్రజాభిప్రాయ సేకరణ


ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ కుమార్ నాయక్

తుగ్గలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బంగారు నిక్షేపాల తవ్వకాలు, శుద్ధి తదితర అంశాల్లో పర్యావరణ పరిక్షణకు లోబడి ఉండాలని ఆర్డీవో డాక్టర్ భరత్ కుమార్ నాయక్ స్పష్టం చేశారు. మంగళవారం మండల పరిధిలోని మద్దికెర గ్రామ శివారులో జియో మైసూరు కంపెనీ పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ బహిరంగ చర్చా వేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అక్కడకు చేరుకున్న పగిడిరాయి, బొండ్లవానిపల్లె, జొన్నగిరి తదితర గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. పలువురు రైతులు మాట్లాడుతూ గతంలో ఇచ్చే లీజులు పెంచుతూ పోవాలని, కంపెనీకి భూములు ఇచ్చిన ప్రతి రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న జియో మైసూరు కంపెనీ ఫ్యాక్టరీ బొండ్లవానిపల్లెకు దగ్గరగా ఉందని ఆ గ్రామానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అంతేగాకుండా బంగారు శుద్ధి చేపట్టే క్రమంలో వచ్చే వ్యర్థ పదార్థాలు, సైనేడ్ వంటి విష పదార్థాలు భూగర్భజలాల్లో కలిసిపోయి నీరు కలుషితం కాకుండా చూడాలని కోరారు. స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ కంపెనీ ప్రభుత్వ నిబంధనల మేరకు తవ్వకాలు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఈఈఏపీపీసీడీ ఆర్వో పీవీ కిషోర్ రెడ్డి, జేపీఈఈ మునిస్వామి నాయుడు, జియో మైసూరు కంపెనీ డైరెక్టర్లు జడ్ డెవిసీస్, మానస రంజన్ బిశ్వాల్, జనరల్ మేనేజర్ రామ్మోహన్, సోమిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ ఎర్రనాగప్ప, నాయకులు ఈశ్వర్ రెడ్డి, జగన్నాథరెడ్డి, మిద్దె వెంకటేశ్ యాదవ్, రవి యాదవ్, సర్పంచ్‌లు ఓబులేసు, సౌజన్య, నబీ రసూల్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో 'జియో మైసూరు కంపెనీ'

ఎండీ హనుమ ప్రసాద్


మాట్లాడుతున్న జియో మైసూరు కంపెనీ ఎండీ హనుమ ప్రసాద్

కంపెనీ ప్రారంభానికి ముందుగానే ఈ ప్రాంతంలో రూ.3 కోట్లకు పైగా ఖర్చు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని జియో మైసూరు కంపెనీ ఎండీ హనుమప్రసాద్ వెల్లడించారు. బంగారు నిక్షేపాల తయారీ పనులు ప్రారంభమైతే వచ్చే లాభంలో కొంత భాగం సమాజ సేవకే వెచ్చిస్తామన్నారు. రైతుల సమస్యలన్నింటినీ పరిష్కరించి, వారి సహకారంతోనే దేశంలోనే మొట్టమొదటి ప్రైవేటుబంగారు నిక్షేపాల ప్రైవేటు ఫ్యాక్టరీని ఇక్కడ నెలకొల్పుతున్నామని అన్నారు. ఫ్యాక్టరీ చుట్టూ 27వేల మొక్కలు నాటామని, భవిష్యత్తులో మరిన్ని మొక్కలు కూడా పెంచుతామన్నారు. బంగారు నిక్షేపాలు తీసి మిగతా వేస్టేజీతో మట్టిపై గ్రీనరీ పెంచుతామన్నారు. 597.82 హెక్టార్లలో బంగారు నిక్షేపాల మైనింగ్ జరుగుతుందని, ఇప్పటికే రూ.320 కోట్లు వెచ్చించామన్నారు. పర్యావరణ పరీరక్షణ కోసం రూ.7.7 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. సైనేడ్ వంటి విష పదార్థాలతో ఎలాంటి హామీ కలగకుండా ఇంటర్నేషనల్ లెవల్‌లో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఏటా 750 కిలోల బంగారు వెలికితీసేలా చర్యలు చేపడతామని, ఆరు నెలల్లో ఫ్యాక్టరీ ప్రారంభం అవుతుందని, స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు.

అక్రమ ఇసుక దందా..

- మంత్రాలయంలో అడ్డూ అదుపూ లేకుండా అక్రమ రవాణా
- రాత్రి, పగలు తుంగభద్రను తోడేస్తున్న తెలుగు తమ్ముళ్లు
- ఉచిత ఇసుక పేరుతో అక్రమ సంపాదన



లాడ్జి నిర్మాణానికి డంప్ చేసిన ఇసుక

మంత్రాలయం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో అక్రమ ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో అధికార పార్టీకి చెందిన నాయకులు అక్రమ సంపాదనే ధ్యేయంగా అక్రమ ఇసుకకు తెర లేపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందించాలనే సదుద్దేశంతో ప్రవేశ పెట్టగా.. ఇక్కడ మాత్రం అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో తెలుగు తమ్ముళ్లు ఉచిత ఇసుక పేరుతో లాడ్జీలు, హోటళ్లకు, పెద్ద పెద్ద భవంతులకు నది నుంచి ట్రాక్టర్లతో ఇసుకను తోడేస్తున్నారు. కొంత మంది తెలుగు తమ్ముళ్లు ట్రాక్టర్లను అద్దెకు తీసుకుని అధికారులను గుప్పిట్లో పెట్టుకుని తమ మాట వినకుంటే టీడీపీ నాయకుల నుంచి ఫోన్లు చేయించి దర్జాగా అక్రమ ఇసుకను తరలిస్తున్నారు. మంత్రాలయంలో ఈ మధ్య కాలంలో దాదాపు 25 నుంచి 30 కొత్త లాడ్జీల నిర్మాణం చేపట్టారు. వీటికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రీచుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా జరగాల్సి ఉండగా.. అవేమీ పట్టించుకోకుండా పక్కనే ఉన్న తుంగభద్ర నది నుంచి రాత్రి, పగలు అని తేడా లేకుండా భక్తులకు ఇబ్బందులకు గురి చేస్తూ అక్రమ ఇసుకను డంపింగ్ చేస్తున్నారు. ఒక్కొక్క లాడ్జీ నిర్మాణం వద్ద 15 నుంచి 50 ట్రాక్టర్ల దాకా ఇసుకను డంప్ చేసుకున్నారు. ఇది అక్రమమని తెలిసినా కూడా వారిని అడిగే వారు లేరు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచిత ఇసుకను అందించాలనే ఉద్దేశంతో ఉండగా.. ఇక్కడి నాయకులు మాత్రం సొమ్ము చేసుకునే అక్రమ సంపాదనలో మునిగి తేలుతున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.2వేల నుంచి రూ.3వేల వరకు ఎమ్మిగనూరు, కల్లుదేవకుంట, చిలకలడోన, సూగూరు, బూదూరు, మాలపల్లి, మాధవరం, సుంకేశ్వరి, రచ్చుమర్రి గ్రామాలకు సరఫరా చేస్తూ రోజుకు వేల రూపాయలు సంపాదిస్తున్నారు.



తుంగభద్ర నదిలో ఇసుకను తవ్విన ప్రదేశం

● రెండు ట్రాక్టర్లు సీజ్.: సూగూరు గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ రవి, మంత్రాలయం ఎస్‌ఐ శివాంజల్, వీఆర్వో భీమన్నగౌడు తెలిపారు. రాగసుధ వద్ద ఓ ప్రైవేటు లాడ్జీ నిర్మాణానికి ఎస్‌పీ పుష్కర ఘాట్ నుంచి ఇసుకను తోలుతున్న రజాక్, వెంకటేశ్‌లకు చెందిన రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామని, మరో రెండు ట్రాక్టర్లు తప్పించుకున్నాయని తెలిపారు. రెండు ట్రాక్టర్లకు చెరో రూ.10వేలు జరిమానా విధించారు.

● లాడ్జిలకు అనుమతి ఉంటేనే ఉచిత ఇసుక



మంత్రాలయంలో పేదల ఇళ్లకు, సాధారణ గృహాలకు ఉచిత ఇసుకను తోడుకోవచ్చని, లాడ్జీలకు, హోటళ్లకు, పెద్ద పెద్ద భవనాలకు అనుమతి లేకుండా నది నుంచి ఇసుక తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. ఇప్పటికే నదిలో అక్రమ ఇసుకకు పాల్పడే ప్రాంతాలను గుర్తించి నివారించామన్నారు. అక్రమ ఇసుక రవాణా జరగకుండా వీఆర్‌వోలు, వీఆర్ఏలకు ఆదేశాలు జారీ చేశామని, అక్రమ ఇసుక డంప్‌లను వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

- ఎస్ రవి, మంత్రాలయం, తహసీల్దార్

అక్రమ ఇసుక అని తేలితే.. కేసు నమోదు



తుంగభద్ర నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే రెవెన్యూ అధికారుల సలహాలు, సూచనలతో కేసులు నమోదు చేస్తాము. శనివారం అక్రమంగా లాడ్జీలకు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పగించాం. నదీ తీరంలో అక్రమ ఇసుకకు పాల్పడే వారిపై నిఘా ఉంచాం.

- శివాంజల్, ఎస్ఐ, మంత్రాలయం

కులుమాలలో డెంగీ నమోదు



కులుమాల గ్రామంలో దోమల మందు పిచికారీ

గోనెగండ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో డెంగ్యూ వ్యాధి కేసులు రెండు నెలలుగా పెరుగుతున్నాయి. మంగళవారం కులుమాల గ్రామంలో ఓ మహిళకు డెంగీ వ్యాధి సోకిందని ఆదోని డివిజన్ మలేరియా అధికారి సాయిబాబా తెలిపారు. మంగళవారం కులుమాల గ్రామంలో ఆయన, వైద్య సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. వీధుల్లో ఉన్న మురుగు నీటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అనారోగ్యంగా ఉంటే వెంటనే ప్రభుత్వ అసుపత్రికి తీసుకురావాలని వైద్యసిబ్బంది సూచించారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

రుద్రవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్. కొత్తపల్లె గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమైందని బాధితుడు ఓబన్న మంగళవారం తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల గుడిసె కాలిపోవడంతో కట్టుబట్టలతో బయటపడ్డామని బాధితులు వాపోయారు. రూ.80 వేల నగదు, వంటపాత్రలు, ధాన్యం, ఇతర వస్తువులు, బీరువా, టీవీ, ఫ్యాన్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.



ఆర్.కొత్తపల్లెలో కాలిపోయిన గుడిసె

● రూ.2 లక్షల నష్టం

బీవీఆర్ యూట్యూబర్‌ది హత్యే..



తిరుమల్ రెడ్డి (ఫైల్)

మద్దికెర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బీవీఆర్ యూట్యూబర్ బి. తిరుమల్ రెడ్డి హంద్రీ నీవా కాలువలో మృతదేహం మంగళవారం లభ్యం కావడంతో ఇది హత్యే అని తేలిపోయింది. మద్దికెర గ్రామానికి చెందిన తిరుమ లరెడ్డి గుంతకల్లులోని తిలక్‌నగర్‌లో కాపురముంటూ యూట్యూబ్ చానల్ నడుపుతున్నాడు. అయితే.. ఈ నెల 17న బుగ్గ సమీపంలోని తన తోటకు ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. తర్వాత మాయమయ్యాడు.. మంగళవారం మధ్యాహ్నం కసాపురం వద్ద గల హంద్రీనీవా కాలువ వద్ద ఆయన శవం కనిపించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కసాపురం పోలీసులు పత్తికొండకు తరలించారు. దీంతో ఇది హత్యే అని తేలింది. బుగ్గ సంగాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో తిరుమల్‌రెడ్డి పది రోజుల క్రితం గొడవ పడినట్లు ఆయన భార్య కామేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఆ వ్యక్తే హత్య చేయించి కాలువలో పడేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి యువకుడి మృతి



చరణ్ (ఫైల్)

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం బిళ్లలాపురం గ్రామానికి చెందిన చరణ్ (24) ప్రమాదవశాత్తూ పట్టణ శివారులోని చిన్న చెరువులో పడి మృతిచెందినట్లు తాలుకా అర్బన్ సీఐ ఈశ్వరయ్య తెలిపారు. డిగ్రీ వరకు చదువుకున్న చరణ్ ఉద్యోగం రాకపోవడంతో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ ఇంట్లో తల్లిదండ్రులకు ఆసరాగా ఉండేవాడు. ఆదివారం స్నేహితులతో కలిసి చిన్న చెరువుకు వచ్చాడు. స్నేహితులందరూ ఊరికి బయల్దేరగా కాసేపు ఉండి వస్తానని చెప్పడంతో వారందరూ ఊరికి వెళ్లిపోయారు. స్నానం చేసేందుకు చెరువులోకి దిగిన చరణ్ నీటి లోతును పసిగట్టలేక ఈతరాకపోవడంతో పూడికలో కూరుకుపోయి మృతిచెందినట్లు సీఐ తెలిపారు. సోమవారం మృతదేహం చెరువులో కనబడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు బిళ్లలాపురానికి చెందిన చరణ్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాలకు తరలించారు. యువకుడి తండ్రి బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

ఓర్వకల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై సోమయాజులపల్లె-బేతంచెర్ల క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందారు. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన సున్నంవలి, భార్య మహబూబ్‌బీ కర్నూలులో పనులు ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరారు. అయితే వెనుక వైపు నుంచి వస్తున్న కారు ఢీకొని మహబూబ్ బీ (45) తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. భర్త సున్నంవలికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టరు కింద పడి వ్యక్తి..

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సంజామల మండలం నట్లకొత్తూరు గ్రామానికి చెందిన వెంకట సుబ్బారెడ్డి (37) అనే వ్యక్తి కోవెలకుంట్లలో ట్రాక్టర్ కింద పడి మంగళవారం మృతి చెందాడు. కుందూ నుంచి ట్రాక్టర్‌లో గ్రావెల్ తీసుకొని కోవెలకుంట్లకు వచ్చాడు. అయితే వెంకటసుబ్బారెడ్డి ట్రాక్టర్ డోర్ తెరుస్తుండగా డ్రైవర్ సయ్యద్ ఒక్కసారి ట్రాక్టర్‌ను రివర్స్ చేయడంతో వెంకటసుబ్బరెడ్డి ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సంఘటనాస్థలానికి వివరాలు సేకరించారు. మృతుడి బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నక్షాతో భూములకు శాశ్వత రక్ష

- ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కమిషనర్ రవీంద్రబాబు
- పైలెట్ ప్రాజెక్టుల్లో కర్నూలు ఎంపిక కావడంపై హర్షం



డ్రోన్ ఫ్లయింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్, డైరెక్టర్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రభుత్వం, ప్రైవేటు భూములకు, కేంద్ర ప్రభుత్వం జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్ట్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్(ఎన్ఏకేఎస్‌హెచ్ఏ-నక్షా) కార్యక్రమం శాశ్వత రక్ష ఇస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు, సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్, ఉమ్మడి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సమన్వయకర్త బిసి. ఫరిదా అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో సచివాలయ అడ్మిన్లు, ప్లానింగ్, వీఆర్‌ఓ కార్యదర్శులతో నక్షా కార్యక్రమ ప్రారంభోత్సవ సభను నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నక్షా కార్యక్రమ లక్ష్యం, అమలు ప్రక్రియ, పనితీరు, ఫలితాలు వంటి వివరాలను పవర్ ప్రెజెంటేషన్ ద్వారా సర్వే ఆఫ్ ఇండియా, డ్రోన్ ఫ్లయింగ్ ఏజెన్సీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. నక్షా పోస్టులను ఆవిష్కరించిన అనంతరం సమావేశ భవనం పైనుంచి ఎమ్మెల్యే, కమిషనర్ డ్రోన్ ఫ్లయింగ్ తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో భూములకు సంబంధించి సమస్యలు, సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. నక్షా కార్యక్రమం దిగ్విజయంగా పూర్తైతే, శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డిజిటల్ ఇండియా భూ రికార్డుల డిజిటలీకరణ కార్యక్రమం(డీఐఎల్ఆర్ఎంపి)లో భాగంగా నక్షా కార్యక్రమాన్ని రూపకల్పన చేసిందన్నారు. నగర పరిధి 114 స్క్వేర్ కిలోమీటర్లు ఉందని, పైలెట్ ప్రాజెక్ట్ కింద తొలి దశగా ఏడాది కాలంలో 49 స్క్వేర్ కిలోమీటర్ల భూమిలో సర్వే పూర్తి అవుతుందన్నారు. వివాద రహిత శాశ్వతమైన ల్యాండ్ రికార్డు ఏర్పాటుకు నగర ప్రజలంతా సహకరించాలని కమిషనర్ కోరారు. సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నక్షా కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా దేశ వ్యాప్తంగా 152 పట్టణాలను ఎంపిక చేయగా ఏపీలో ఏడు జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్వెల్ జియోస్పేషియల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు కే. రవి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్‌వో జునైద్, సూపరింటెండెంట్ సుబ్బన్న, టీపీఎస్ అంజాద్‌బాషా, సిబ్బంది అనంత వెంకటేష్, భార్గవ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రోగ నిర్ధారణ పరీక్షలను బయటకు పంపితే చర్యలు

- నర్సింగ్ సేవలు మరింత మెరుగుపడాలి
- జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రోగ నిర్ధారణ పరీక్షలను బయటకు పంపితే కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం ధన్వంతరీ హాలులో హెడ్ నర్సులు, వార్డు ఇన్‌చార్జిలతో సీఎస్ఆర్ఎంవో డా.బి. వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటర్ పి.సింధూ సుబ్రహ్మణ్యంతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి నర్సింగ్ సేవలు ఎంతో కీలకమన్నారు. నర్సింగ్ సేవలను మరింతగా మెరుగుపరుచుకోవాలని, ఆసుపత్రిలో పలు విభాగాల్లో ఉండే హెడ్ నర్సులు, ప్రతి రోజు విభాగాల్లో డాక్టర్లతో పాటు రౌండ్స్‌లో పాల్గొనాలని ఆదేశించారు. ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో, పారిశుధ్య కార్మికులు, రోగుల నుంచి డబ్బులు అడిగితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమీక్షలో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 ఎస్‌పీ సావిత్రీబాయి, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ జి. విమలమ్మ పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే



బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మంగళవారం ఓ కేసు విషయంలో వాగ్మూలం ఇవ్వడానికి ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జీ కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసు మార్చి 27వ తేదీకి వాయిదా పడింది. అనంతరం కోర్టుకు వచ్చిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని బార్ అసోసియేషన్ సభ్యులు కలిసి అడిషనల్, సబ్ కోర్టుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించాలని వినతిపత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురురాజారావు, రఘురామ్, న్యాయవాదులు వెంకటేశ్వరరెడ్డి, రషీద్ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఐజీ

కౌతాళం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కౌతాళం పోలీసు స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే స్టేషన్‌ను తనిఖీ చేశానని స్టేషన్‌లో కేసుల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు మర్యాదగా నడుచుకోవాలని తెలిపారు. వీరి వెంట ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, కౌతాళం సీఐ అశోక్ కుమార్ ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఐజీ ప్రవీణ్

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



ఖైదీల ఆహారాన్ని పరిశీలిస్తున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తనను అలవర్చుకుని మంచి పౌరులుగా మారాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ఖైదీలకు సూచించారు. స్థానిక పంచలింగాలలోని జిల్లా జైలును ఆ తర్వాత నగరంలోని మహిళా జైలును ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన నేరాలను మరిచిపోయి సమాజంలో మంచి పౌరులుగా మారడానికి శిక్షా కాలాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఖైదీలకు న్యజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారని, అందులో ఓ అడ్వకేట్, ఓ పారా లీగల్ వలంటీర్ ఉంటారని, వారి ద్వారా ఖైదీలు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు.ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారు హెల్ప్‌లైన్ నెంబర్.15100 సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

దామోదరం జిల్లాగా ప్రకటించాలి



పెద్దపాడులో సంజీవయ్య ఇంటి వద్ద గ్రామస్థులతో రామకృష్ణ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతిశ్రేయస్సు కోసం జీవితాన్ని అంకితం చేసిన నిరాడంబర, మాజీ సీఎం దామోదరం సంజీవయ్య పేరును కర్నూలు జిల్లాకు నామకరణం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. అదేవిధంగా హంద్రీనది ఒడ్డున సంజీవయ్య స్మారకస్థూపం, విజ్ఞానకేంద్రం ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. మంగళవారం సంజీవయ్య స్వగ్రామం పెద్దపాడులో ఆయన నివసించిన ఇంటిని పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి సంజీవయ్య జీవితం గురించి తెలుసుకున్నారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన ఆదర్శమూర్తి సంజీవయ్య అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సంజీవయ్య రెండేళ్ల స్వల్పకాలం పదవిలో ఉన్నా వినూత్న పథకాలతో ప్రజా సంక్షేమానికి పాటుపడ్డారని తెలిపారు. పెద్దపాడు గ్రామంలో సంజీవయ్య పేరిట కమ్యూనిటీహాల్ నిర్మించాలని, జీవిత చరిత్రను పాఠ్య పుస్తకంగా తీసుకురావాలని డిమాండ్ చేశారు. 105 జయంతి నాటికి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు లేఖ రాస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, నాయకులు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18: (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు మంగళవారం జరిగాయి. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 45 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 1513 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 1495 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 45 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 1390 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 1368 మంది పరీక్షకు హాజరయ్యారు. ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో కన్వీనర్ గురువయ్య శెట్టి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ సభ్యులు నాగభూషణం రెడ్డి, పద్మావతి, స్క్వాడ్ బృందాలు తదితరులు పర్యవేక్షించారు.

చెక్ డ్యామ్ పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి

కర్నూలు రూరల్ ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం నందనపల్లె గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన చెక్ డ్యామ్ పనులను మంగళవారం జిల్లా ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి పరిశీలించారు. అనంతరం ఆమె పడిదెంపాడు గ్రామ పంచాయతీ పరిధిలో హార్టికల్చర్‌లో సీనిపండ్ల తోటను పరిశీలించారు. అలాగే నగరవనంలో నిర్మించిన రోడ్లను పరిశీలించారు. అక్కడ నుంచి గార్గేయపురంలో సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని సందర్శించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. చెత్తసంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం గార్గేయపురం సచివాలయాన్ని సందర్శించి అక్కడి సిబ్బందిని భూసర్వే పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఎంపీడీవో రఘునాథ్ ఉన్నారు.

వైభవంగా రామిరెడ్డితాత తిరుణాల

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండలో రామిరెడ్డితాత తిరుణాల వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయంలో వేకువజామున మేలుకొలుపు, సుప్రభాతం, పంచామృతాభిషేకం, అర్చన పూజలు చేశారు. ఈ సందర్భంగా తాత పాలరాతి విగ్రహాన్ని పూలమాలలు, పట్టువస్త్రంతో అలంకరించారు. అనంతరం ఆలయంలో రామిరెడ్డితాత నామసంకీర్తన జరిగింది. మధ్యాహ్నం పల్లకిలో స్వామి కాంస్య విగ్రహం ఉంచి మేళతాళాల మధ్య నంది కోలలు ఆడిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు.

బీసీలకు అండగా ఆదరణ పథకం

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బీసీలకు అండగా కూటమి ప్రభుత్వం ఆదరణ 3.0 పథకం ప్రవేశపెట్టిందని బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సత్రం రామక్రిష్ణుడు అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మంత్రి సవీతమ్మతో పాటు సంబంధిత అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారన్నారు. ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నారన్నారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్ర చికిత్స

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 84 ఏళ్ల వృద్ధుడిలో పెద్ద కామన్‌బైల్ డ్యూక్ట్ (సీబీడీ) రాయి 14 ఎంఎం ఉంది. దాన్ని నిర్ధా రణ చేసి ఈఆర్‌సీపీ ప్రక్రియ ద్వారా కర్నూలు మెడికవర్ హాస్పిటల్ వైద్యులు తొలగించి రోగి ప్రాణాన్ని కాపాడారు. రోగికి సీబీడీ రాయి కారణంగా అబ్రక్టివ్ జాండిస్ ఉండటంతో తీవ్ర జ్వరం, కడుపు నొప్పి లక్షణాలతో ఆసుపత్రిలో చేరారు. హాస్పిటల్ కన్సల్టెంట్ డాక్టర్ అబ్దుల్ సమద్ పరీక్షలు చేయగా.. కుడి పైభాగాపు కడుపులో నొప్పి 14 ఎంఎం రాయి ఉన్నట్లు గుర్తించారు. ఈఆర్‌సీపీ ప్రక్రియ ద్వారా రాయిని తొలగించారు. మూడు రోజుల తర్వాత ఎండోస్కోపిక్ రెట్రోగ్రేడ్ చోలంగి పాంక్రియాటోగ్రఫి ప్రక్రియ నిర్వహించడంతో రోగి కొలుకుని డిశ్చార్జి అయినట్లు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ అబ్దుల్ సమద్ తెలిపారు.

పాఠశాలలో ప్రారంభమైన లాంగ్వేజ్ ఫెస్టివల్స్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథ మిక, ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఇంగ్లీస్ లాంగ్వేజ్ ఫెస్టివల్స్ ఘనంగా జరిగాయి. ఈవేడుకలు ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగుతాయి. విద్యార్థులకు కథలు, గానం, క్విజ్, పఠన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 372 పాఠశాలలో వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలను ఉపవిద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిం చారు. బుధవారం సంస్కృతం, హిందీ, ఉర్దూ లాంగ్వేజ్ వేడుకలు జరుగుతాయి.

అమడగుంట్లలో భాషోత్సవాలు ప్రారంభం

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో భాషోత్సవాలను హెచ్‌ఎం అనంతయ్యయాదవ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించ డానికి ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. ఇం దులో భాగంగా ఈనెల 21 వరకు భాషోత్సవాలకు శ్రీకారం చుట్టిందని అన్నారు. మొదటిరోజు ఇంగ్లీషుకు సంబంధించి ప్రతి తరగతిలో విద్యార్థులకు రీడింగ్, స్టోరీ రైటింగ్, రైమ్స్, స్పెల్లింగ్ చెక్, డిబేట్ నిర్వహించారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని టీడీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మధు తెలిపారు. ఈ బైక్ ర్యాలీ వీకర్‌సెక్షన్ కాలీలోని శ్రీ పట్టాభి రాములు, వీరాం జనేయ స్వామి ఆలయం వద్ద నుంచి ఉల్లాల రోడ్డులోని శివాజీ సర్కిల్ వరకు ఉంటుందని ఆయన తెలిపారు.

● **నగరంలో శోభాయాత్ర:** ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నగరంలోని బండిమెట్ట వీధికి చెందిన బాల శివాజీ యూత్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు బండిమెట్ట వీధి నుంచి రాజ్‌విహార్‌లోని స్వామి వివేకానంద సర్కిల్ వరకు శోభాయాత్ర ఏర్పాటు చేసినట్లు బాలశివాజీ యూత్ నిర్వాహకులు తెలిపారు. శోభాయాత్ర బండిమెట్టలోని అంబాభవానీ దేవాలయం నుంచి ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు.

విజ్ఞాన మేళాకు స్పందన

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న విజ్ఞాన మేళాకు స్పందన వస్తోంది. మంగళవారం వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు తరలివచ్చి వివిద ప్రాజెక్టులను సందర్శిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. మనిషిని పోలిన హ్యూమానాయిడ్ రోబోట్ ప్రేక్షకులతో సంభా షణలు జరిపి వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి ఆశ్చర్యపరిచింది. అలాగే లేజర్ ఎన్‌గ్రేజింగ్ మిషన్ కూడా ఆహూతులను ఆకర్షించింది. ఈ మేళా బుధవారంతో ముగియనుంది. ముగింపు వేడుకల్లో ఉత్తమ ప్రాజెక్టులకు ఎంపికైన వారికి ముఖ్య అతిథులు బహుమతులు అందజేస్తారు.

3 నుంచి ఓర్వకల్లులో ఉరుసు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో వెలసిన హాజరత్ సయ్యద్ సుల్తాన్ మహమూద్ షాఖాద్రి స్వామి వారి ఉరుసు మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. మార్చి 3న గంధం, 4న ఉరుసు, 5న కిస్తీలు నిర్వహి స్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.

భక్తుల సేవలో దేవగిరి వాసులు

● ప్యాలకుర్తి వద్ద శిబిరం
● శ్రీశైల పాదయాత్రికులకు అన్నదానం, వైద్య సేవలు

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలానికి పాదయాత్ర చేసే భక్తులకు దేవగిరి వాసులు సేవలందిస్తున్నారు. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలంలోని దేవగిరి గ్రామవాసులు గత 14 ఏళ్లుగా భక్తుల సేవలో తరిస్తున్నారు. మండలంలోని ప్యాలకుర్తి సాయిబాబా ఆశ్రమం వద్ద శిబిరం



శివస్వాములకు మందులు అందజేస్తూ..



భక్తులకు అన్నదానం చేస్తున్న దేవగిరి వాసులు

ఏర్పాటు చేస్తున్నారు. వారం రోజులపాటు అల్పాహారం, టీ, బిస్కట్, అన్నదానం, మజ్జిగ, వైద్యసేవలు, బ్యాగులకు రేడియం స్టిక్కర్లు, సెల్‌ఫోన్ చార్జింగ్ సదుపాయం ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు శిబిరంలో అన్నదానం స్వీకరిస్తున్నారు. కాళ్ల నొప్పులు, జ్వరం, బొబ్బలు తదితర ఇబ్బందులకు మాత్రలు, ఆయింట్‌మెంట్ తీసుకుంటున్నారు. ఆశ్రమం వద్ద ఉన్న చెట్ల నీడన విశ్రాంతి తీసుకుని తిరిగి పాదయాత్ర ముందుకు సాగిస్తున్నారు. అవసరమైన వారు సెల్‌ఫోన్లకు చార్జింగ్ చేస్తున్నారు. ఈ నెల 15 నుంచి భక్తులకు సేవలు ప్రారంభించామని దేవగిరి వాసులు తెలిపారు.

మల్లన్న దయ



గత పద్నాలుగేళ్ల క్రితం అన్నదానం ప్రారంభించాం. ఏటేటా ఖర్చు పెరుగుతోంది. ప్రస్తుతం రూ5లక్షల నుంచి రూ.7 లక్షల వరకు అవు తోంది. ఈ దైవకారంలో దేవగిరి ప్రజలు, కొందరు దాతలు పాలుపం చుకుంటున్నాం. భక్తులకు నాణ్యమైన భోజనం, అల్పాహారం అందిస్తున్నాం. ఇదంతా మల్లన్న దయ.

- బసవరాజ్, దేవగిరి

ఆరోగ్య సలహాలు ఇస్తున్నా



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు శిబిరంలో భోజనం చేసి ఇక్కడే విశ్రాంతి తీసుకుంటున్నారు. అలాగే ఆరోగ్యపరమైన ఇబ్బందులకు వైద్యశిబిరంలో మాత్రలు తీసుకుంటున్నారు. అవసరమైన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, బ్యాగులకు రేడియం స్టిక్కర్లు అతికిస్తూ పలు సలహాలు ఇస్తున్నాం.

- జగదీశ్వర రెడ్డి, ఆర్ఎంపీ, దేవగిరి

12వ సారి పాదయాత్ర



శివదీక్షలో 12వ సారి పాదయాత్ర చేస్తున్నాను. ప్యాలకుర్తి వద్ద ఏ సమయంలో వచ్చినా అన్నం వడ్డిస్తున్నారు. అలాగే ఆరోగ్యపరమైన ఇబ్బందులకు మాత్రలు ఇస్తారు. ఇక్కడ విశ్రాంతి తీసుకోవడానికి వసతి బాగుంది.

- అర్జున్, హొళగుంద

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పకడ్బందీగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు

కల్లూరు తహసీల్దారు ఆంజనేయులు



కల్లూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను కల్లూరు మండలంలో పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి వ్యక్తికి ఆధార్ కార్డు లాగా ప్రతి రైతుకు 11 అంకెల రిజిస్ట్రేషన్ నెంబరు నమోదు చేసి ఒక ఖాతా ఇస్తామని తహసీల్దారు కె.ఆంజనేయులు తెలిపారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో రీసర్వే పనులు ఎక్కడ జరుగుతున్నాయి.

జవాబు: కల్లూరు మండలం పర్లలో రీసర్వే పనులు జరుగుతున్నాయి. రైతులు ఫీల్డ్‌కు వచ్చి సర్వేలో పాల్గొనాలి. వారి భూమి సరిహద్దులు అధికారులకు చూపించి సమస్యలు తలెత్తకుండా రీసర్వే పనులు పూర్తి చేసుకోవాలి.

ప్రశ్న: పీజీఆర్ఎస్-గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రజల ఫిర్యాదుల పరిష్కారం అవుతున్నాయా?

జవాబు: పీజీఆర్ఎస్-గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై సత్వర పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నాం. సీఎంఓ నుంచి వచ్చిన గ్రీవెన్స్, ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల నుంచి అందిన పబ్లిక్ గ్రీవెన్స్, రెవెన్యూ సదుస్సుల్లో వచ్చిన ప్రజల ఫిర్యాదులు, ప్రతి సోమవారం ప్రజల నుంచి వచ్చే వినతులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి గడువులోపు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు అందించేలా కృషి చేస్తున్నాం.

ప్రశ్న: వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారా?

జవాబు: గ్రామ సచివాలయాల్లో వీఆర్వోలు ఖచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి. ఎండీయూ ఆపరేటర్లు, వాహనాల ద్వారా నిత్యావసరాలను పంపిణీ చేయాలి. ఎక్కడైనా ప్రజలు ఇబ్బందులకు గురైతే సమస్యలను మా దృష్టికి తీసుకురావాలి.

దోమలతో సంక్రమించే వ్యాధులతో ప్రమాదం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శాంతికళ

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): దోమలతో సంక్రమించే వ్యాధులతో మరింత ప్రమాదం ఉంటుందని డీఎంహెచ్‌వో పి.శాంతికళ అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో జిల్లా మలేరియా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులకు కీటకజనిత వ్యాధులపై శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. జిల్లాలో 2025లో డెంగీ కేసులు 22 దాకా నమోదయ్యాయని, ఈ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కర్నూలు జీజీహెచ్ జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దమం శ్రీనివాసులు మాట్లాడుతూ ఐక్టార్ బర్న్ డిసీజ్‌ను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి నూకరాజు, అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కేవీ సుబ్బారెడ్డి కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



నాగేంద్రరెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కేవీ సుబ్బారెడ్డి ఇంజ నీరింగ్ కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆర్. నాగేంద్రరెడ్డికి రాజస్థాన్‌లోని అల్వార్ సన్రైజ్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మనీస్ కుమార్ సింగ్ పర్యవేక్షణలో (ఫ్లూయిడ్ డైనమిక్స్‌లో హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఆన్ అన్‌స్టడి ఎంహెచ్‌డీ ఫ్లో త్రూ పోరాస్ మీడియం బిట్విన్ ఇన్‌ఫైట్ ఎర్టికల్ పోరాస్ ప్లేట్స్) అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేశారు. ఆర్.నాగేంద్రరెడ్డికి కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, కస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ కన్నా కుమార్, ఆధ్యాపకులు అభినందించారు.

కమిషనర్‌ను కలిసిన టీడీపీ నాయకులు

గూడూరు ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ రమేష్‌బాబును కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్‌తో పాటు టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అయ్యవారి నాయుడు, సంగాల మధు, మూలగేరి లక్ష్మన్న, నాగరాజు, చెట్టుకింది నారాయణ, గోవిందు పాల్గొన్నారు.

రేపు త్రివేణి సంగమ జలాలు పంపిణీ

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళా సందర్భంగా త్రివేణి సంగమం నుంచి తీసుకువచ్చిన నదీ జలాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు సాయి సేవా మండలి కార్యదర్శి ఎస్‌జీ మహబలేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని అన్ని షిరిడీ సాయిబాబా దేవస్థానాలలో గురువారం ఉదయం 7 గంటల నుంచి భక్తులందరికీ ఉచితంగా ఇస్తారని ఆయన పేర్కొన్నారు. అలాగే పాత నగరంలోని దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానంలో అలనాడు బాబా గారు షిరిడీలో ఉన్నప్పుడు తన రెండు పాదాల నుంచి ఆ గంగా యమునా సంఘమ జలాలను ఏ విధంగా అయితే తీశారో ఆ దృశ్యాన్ని కనులకు కట్టినట్లుగా చూపిస్తూ సెట్టింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి: ఎంఈవో



ఓర్వకల్లులో మాట్లాడుతున్న ఎంఈవో ఓంకార్ యాదవ్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు ఓంకార్ యాదవ్, శ్రీధర్‌బాబు సూచించారు. మంగళవారం ఓర్వకల్లు మోడల్ స్కూల్‌లో ఐసీడీఎస్, విద్యాశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వచ్చే విద్యార్థులకు గణితం, తెలుగుపై పలు సూ చనలిచ్చామన్నారు. ఆర్పీల ద్వారా ఈనెల 25 వరకు శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజ్మా, రిసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గూడూరు: అంగన్‌వాడీ టీచర్లకు ఆరు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ తెలిపారు. మంగళవారం గూడూరు పట్టణంలోని జడ్పీ బాలికల పాఠశాలలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణను అంగన్‌వాడీలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో-2 నాగరాజు, జడ్పీ బాలుర పాఠశాల హెచ్‌ఎం సురేష్‌బాబు పాల్గొన్నారు.

రాజగోపాల్ మరణం తీరని లోటు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కార్మిక, ప్రజా ఉద్యమ నేత, మాజీ కార్పొరేటర్ కె.రాజగోపాల్(64) మరణం సీపీఎంకు తీరని లోటని పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ.గఫూర్ అన్నారు. మంగళవారం పాతబస్తీ బండిమెట్ట రాజగోపాల్ స్వగృహంలో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు పీఎస్.రాధాక్రిష్ణ, ఎండీ ఆనంద్‌బాబుతో కలిసి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ రాజగోపాల్ తన జీవిత చివరి అంకం వరకు కష్టజీవుల పక్షపాతిగా పని చేశారన్నారు. గత రెండు వారాలుగా అనారోగ్యంతో డయాలసిస్ చేయించుకుంటూ సోమవారం రాత్రి మరణించారని, ఆయన మృతికి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. దహన సంస్కారాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు పి.నిర్మల, జి.రామక్రిష్ణ, ఎండీ అంజిబాబు, రాజశేఖర్, రాముడు, టీడీపీ నాయకులు రామాంజనేయులు, గున్నామార్కు పాల్గొన్నారు.



రాజగోపాల్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

● రాజగోపాల్ మృతి వామపక్షాలకు తీరనిలోటని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం అన్నారు. ఆయన స్వగృహం వద్ద రాజగోపాల్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశాలాంధ్ర బ్రాంచ్‌మేనేజర్ నాగరాజు, రామక్రిష్ణారెడ్డి ఉన్నారు.

మార్కెట్ యార్డును తనిఖీ చేసిన సెక్రటరీ

తూకాల్లో మోసంపై కమీషన్ ఏజెంటుపై ఆగ్రహం



కమీషన్ ఏజెంటుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జయలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఓ కమీషన్ ఏజెంటు రైతు తెచ్చిన వామును ఎలక్ట్రానిక్ కాటాపై తూకం వేస్తుండగా.. నిఘా పెట్టిన సెక్రటరీ జయలక్ష్మి మోసాన్ని కనిపెట్టారు. ఒక 100 గ్రాముల వామును ఉన్న దానికంటే తక్కువగా చూపినట్లు ఎలక్ట్రానిక్ కాటాపై తేలడంతో సెక్రటరీ కమీషన్ ఏజెంటుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, కామేష్ ఉన్నారు.

● కర్నూలు మార్కెట్ యార్డులో భోజనశాలలో రైతులకు వడ్డిస్తున్న భోజనాలను సెక్రటరీ జయలక్ష్మితోపాటు అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. అనంతరం రైతులను భోజనం ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు కేవలం రూ.10కే భోజనం అందించం సంతోషించదగ్గ విషయమన్నారు.

ఘనంగా అల్లీహుస్సేన్ స్వామి కిస్తీలు

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరులో సద్గురు అల్లీహుస్సేన్ కిస్తీ వేడుకలు ఘనంగా జరిగాయి. సాయంత్రం చింతతోటలో స్వామి దర్గా ముందున్న రాతి పాత్రలో అన్నప్ర సాదాలు వేసి పూజలు చేశారు. అనంతరం భక్తులు ప్రసాదాన్ని స్వీకరించడానికి పోటీ పడ్డారు. దర్గాలో అల్లీహుస్సేన్ స్వామికి పూజలు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే కొత్తకోటను కలిసిన రామకృష్ణ

కర్నూలు రూరల్ ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అలంపూర్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కలిశారు. మంగళవారం కర్నూలులోని పాతబస్టాండ్‌లో ఉన్న ప్రకాష్ రెడ్డి స్వగృహానికి రామకృష్ణ వెళ్లి కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాల్లో జరుగుతున్న తాజా రాజకీయాలపై చర్చించుకున్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరిగే ఎల్ఐసీ ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎల్ఐసీ కార్యాలయం వద్ద సంఘీభావంగా ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ కార్యక్రమంలో నాయకులు సునియాకుమార్, మక్బూల్ బాషా, గనిమియ్యా, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

సబ్ ఆపరేటర్లను తొలగించాలి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): హొళగుంద మండలం కోగిలతోట విద్యుత్ సబ్ స్టేషన్‌లో నోటిఫికేషన్ లేకుండా అక్రమంగా నియమించుకున్న సబ్ ఆపరేటర్లను తొలగించాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ డీఆర్వో వెంకటనారాయణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నియమించిన వారిని తొలిగించాలని కోరారు.

విజయ్‌కుమార్‌ను కలిసిన జనసేన నాయకుడు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్‌ను జనసేన నాయకుడు చింతా సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కర్నూలుకు విచ్చేసిన ఆయనను ప్రైవేటు హోటల్‌లో కలిసి మాలల సంక్షేమం, జనసేన పార్టీ అభివృద్ధి తదితర అంశాలపై ఇరువురు చర్చించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కారించారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఐ



మాట్లాడుతున్న రామచంద్రయ్య

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు పి.రామచంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఇంటి స్థలాల లబ్ధిదారుల సదస్సు నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు మా ప్రభుత్వం వస్తే ఇల్లు లేని ప్రతి నిరుపేదకు రెండు సెంట్లు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షలు ఇస్తామని చంద్రబాబు ఓట్లు వేయించుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు పేదలకు ఇచ్చే రెండు సెంట్ల స్థలం కోసం అనేక రకాల షర తులు పెట్టి ఇస్తామంటే సరైంది కాదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిరెడ్డి, పాల్గొన్నారు.

రహదారి నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ, ఏఈ

కల్లూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపట్టిన రహదారి నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్ శాఖ డీఈ నాగిరెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం పీఆర్ మండల ఇంజనీరు రవిమోహన్‌రెడ్డితో కలిసి ఆయన కె.మార్కాపురం, పర్ల, ఎ.గోకులపాడు గ్రామాల్లోని సీసీ రోడ్లు, వసతిగృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా డీఈ నాగిరెడ్డి మాట్లాడుతూ కె.మార్కాపురం గ్రామంలో రూ.20లక్షలతో 400 మీటర్ల సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. కల్లూరు మండలంలో 21 పనులకు రెండో విడత రూ.కోటి పదకొండు లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, టీడీపీ నాయకులు మాధవస్వామి, మద్దిలేటి, హరి, దస్తగిరి, శేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రసన్నశ్రీకి వైస్ చాన్స్‌లర్ పదవిపై హర్షం



మాట్లాడుతున్న చంద్రప్ప

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆదివాసి ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన ప్రసన్నశ్రీకి వైస్ చాన్స్‌లర్ పదవి ఇవ్వడంపై ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం టీఎస్ఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ ప్రసన్నశ్రీకి ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో అత్యున్నతమైన ఉపకులపతి పదవిని అందించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామరాజు, నాయకులు ఉపేంద్ర, దత్తు, రవి పాల్గొన్నారు.

జూదంపై ఉక్కుపాదం మోపండి


ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూదం స్థావరాలపై ఉక్కుపాదం మోపాలని ఎమ్మెల్యే పార్థసారధి పోలీసులకు సూచించారు. మంగళవారం డీఎస్పీ, సీఐకి బహిరంగ లేఖ విడుదల చేశారు. పేకాటను నిర్మూలించాలని పలు మార్లు సూచించినా ఇంకా కొనసాగుతున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఇంటిలోనే పేకాట శిబిరాలు నడిపిన విషయం ప్రజలు మరచిపోలేరన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా...

కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారం బీజేపీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని, ఎల్లప్పుడు ప్రజల్లో ఉంటూ, వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆలూరు ఎస్సై దిలీప్ కుమార్ సూచించారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాధితులు సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 930కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం బ్యానర్లను తొలగించాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆదోని, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మద్యం వ్యాపార ప్రకటనల బ్యానర్లను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, మాజీ కౌన్సిలర్ దిలీప్ ధోకా డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఇంత కాలం వ్యాపార ప్రటకనలను చూశామని, ఇప్పుడు మద్యం ప్రకట నల బాన్యర్లు కట్టడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నను. మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరం అనే హెచ్చరికలను బ్యాన ర్‌లో వేయకపోవడంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేతనాల విడుదలపై హర్షం

ఆదోని టౌన్ , ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇమామ్, మౌజంల ఎడాది వేతనాలను విడుదల చేయడంపై మైనార్టీ పరిరక్షణ సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మాట్లాడుతూ, గత ప్రభుత్వం వేతనాలు నిలిపివేయడంతో అష్ట కష్టాలు పడ్డారని తమ నాయకుడు ఫరూక్ షూబ్లీ మంత్రి ఫరూఖ్, సీఎం చంద్రబాబుకు దృష్టికి తీసుకెళ్లడంతో విడుదల చేశారన్నారు.

పంచాయతీ స్థలాల ఆక్రమణ నేరం

మద్దికెర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ స్థలాల ఆక్రమణ నేరమని ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి, కార్యదర్శి శివకుమార్ అన్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు మంగళవారం పశువైద్యశాల వెనుక ప్రాంతంలో ఆక్రమణలను తొలగించారు. పంచాయతీ స్థలాలకు హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు.

వైన్ షాపును ఎత్తివేయాలి

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్త బస్టాండ్ రహదారిలో సుంకులమ్మ ఆలయం వద్ద మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కాలనీవాసులతో సంతకాలను సేకరించారు. ఆలయాలు, బడులకు మద్యం దుకాణాలు దూరంగా ఏర్పాటు చేయాలన్న నిబంధనలు ఉన్నా, ఇక్కడ ఏర్పాటు చేసి, నిబంధనలు ఉల్లంఘించారన్నారు. ఎక్సైజ్ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. వెంకటేష్, మోహన్, నూరి, సురేష్, రవి, రాజు పాల్గొన్నారు.

లాంగ్వేజ్ ఫెస్టివల్ వేడుకలు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఆర్‌లేబర్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రమేష్ నాయుడు ఆధ్వర్యంలో లాంగ్వేజ్ ఫెస్టివల్ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఆంగ్ల భాషపై విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులే హోస్టులుగా వ్యవహరించి నాటికలు ప్రదర్శించారు. ఆంగ్ల భాష నేర్చుకుంటే ఎక్కడైనా రాణించవచ్చని ఆస్పియ ఉర్దూ ప్రభుత్వ పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయుడు నూర్ భాషా తెలిపారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి
- టీ-20 క్రికెట్ విజేత బళ్లారి


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు


టాస్ వేస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్, చిత్రంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

పత్తికొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడల్లో రాణించాలని ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు. పట్టణంలో ఎమ్మెల్యే శ్యాం బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కేఈ మాదన్న స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో మంత్రి పాల్గొన్నారు. విజేతకు ఎమ్మెల్యే ట్రోఫీ అందజేశారు. ఫైనల్స్‌లో బళ్లారి టీం విజేతగా నిలిచి ట్రోఫీ, రూ.2లక్షలను గెలు చుకుంది. మంగళవారం టాస్ గెలిచిన బళ్లారి టీం 199/9 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పత్తికొండ టీం 166పరుగులకు ఆలౌట్ అయింది.

క్రీడాకారులను గుర్తించేందుకే పోటీలు

సత్తా ఉన్న క్రీడాకారును గుర్తించేందుకే క్రికెట్ పోటీలను నిర్వహించామని ఎమ్మెల్యే అన్నారు. ఏటా ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి, ఆర్టీసి చైర్మన్ కొనగళ్ల నారాయణరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగరి, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, నాయకులు నాగేశ్వర యాదవ్, వైకుంఠం జ్యోతి, తుగ్గలినాగేంద్ర, సాంబశివారెడ్డి, బత్తినవెంకట్రాముడు, కేఈ సత్య, కేఈ రుద్రగౌడ్, కేఈ నందీశ్వర్‌గౌడ్‌లతో పాల్గొన్నారు.

రాతిదూలం పోటీలు

దేవనకొండ,ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేటలో ఉరుసు సందర్భంగా రాతిదులం పోటీలు నిర్వహించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు పోటీలను ప్రారంభించారు. ప్రథమ విజేత శనగపల్లి, ద్వితీయ విజేతగా రేమట, తృతీయ విజేతగా లక్కీపల్లి ఎద్లు నిలిచాయి.

భోజనంలో శుచి, శుభ్రత పాటించాలి


మున్సిపల్ హైస్కూల్లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవోలు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భోజనంలో నిర్వాహకులు శుచి, శుభ్రత పాటించాలని ఎంఈవోలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పరీక్షలు ఉన్న కారణంగా వారు పాఠశాలలోనే భోజనం తినేలా చూడాలన్నారు.

బాల్య సంరక్షణపై అవగాహన పెంచుకోవాలి

ఆలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బాల్య సంరక్షణ విద్యపై అవగాహన ఉండాలని సీడీపీవో శశికళ, ఎంఈవోలు కోమల దేవి, చిరంజీవి రెడ్డి కోరారు. మంగళవారం జడ్పీ పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కోర్సుపై శిక్షణ ఇచ్చారు. సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

గ్రాట్యుటీపై హర్షం

వెల్దుర్తి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు గ్రాట్యుటీ ప్రకటించడంపై అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వెల్దుర్తి ఏఐటీయూసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇది వరకే దహన సంస్కారాలకు రూ.15 వేలు ప్రకటించిందన్నారు.

మాలధారులకు అన్నదానం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండగిరిలోని ఈశ్వరుని ఆలయంలో టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాస ఆచారి ఆధ్వర్యంలో శివమాల ధారులకు అన్నదానం చేశారు. ప్రతి ఏడాది భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

21న జాబ్‌మేళా

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో న్యాక్ శిక్షణ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్ కుమార్, న్యాక్ ఇన్‌చార్జి ఉ లిగన్న తెలిపారు. ఎంఎన్‌సీల ప్రతినిధులు పాల్గొని ఎంపిక చేస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన 18ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపువారు సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9177413642 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

చెరువును ఆక్రమిస్తే చర్యలు

మద్దికెర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చెరువులను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హుశేన్ సాహేబ్ మంగళవారం హెచ్చరించారు. సర్పంచ్ బండారు సుహాసిని విజ్ఞప్తి మేరకు మద్దికెర గ్రామంలో డంపింగ్ యార్డుకు స్థలాలను పరిశీలించారు. అనంతరం యజ్ఞం చెరువును పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడం నేరమన్నారు. పశుసంపదను కాపాడుకు నేందుకు చెరువులను నిర్మించారన్నారు. యజ్ఞం చెరువు 62 ఎకరాల్లో ఉందని, కొలతలు వేయించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్ఐ రవికుమార్, బండారు ఆంజనేయులు, వీఆర్వో రంగస్వామి, ఈవో శివకుమార్, వెంకటమాధవ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా తిమ్మప్పస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మద్దికెర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్ప స్వామి, ఎడవల్లప్పస్వామి, ఘడేదూలప్ప స్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. తొమ్మిదో వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అనంతరం సాయంత్రం రథోత్సవాన్ని నిర్వాహించారు. ఎస్ఐ విజయకుమార్ నాయక్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రాథమిక విద్య భవిష్యత్తుకు పునాది


మాట్లాడుతున్న ఎంఈవో రాజేంద్రప్రసాద్

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్య పిల్లల భవిష్యత్తుకు పునాది అని, అంగన్వాడీలు కృషి చేయాలని ఎంఈవో రాజేంద్రప్రసాద్ సూచించారు. మంగళవారం మున్సిపల్, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలల్లో అంగన్వాడీ టీచర్ల శిక్షణను ప్రారంభించారు. ప్రాథమిక విద్య పిల్లల్లో విమర్శనాత్మక, సృజనాత్మక ఆలోచనలు పెంపొందించడానికి సహాయ పడుతుందన్నా రు. టీచర్లు విద్య, ఆరోగ్యం, పోషకాహారంపై దృష్టి సారించాలని సూచించారు. సీడీపీవో ఉమామహేశ్వరి, ఎంఈవో-2 శ్రీనివాసులు హెచ్ఎంలు మల్లికార్జున, అలీం సిద్ధికి, సీఆర్పీలు బీచుపల్లి, మల్లికార్జున పాల్గొన్నారు.

రైతుల రుణాలు మాఫీ చేయాలి

- సీపీఎం నాయకుల ధర్నా

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు మైక్రో ఫైనాన్స్ కంపెనీలు ఇచ్చిన రుణాలను మాఫీ చేయాలని సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీవో అధికారులకు సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. చిన్న, సన్నకారు రైతులకు గ్రామీణ ప్రాంతాల్లోని ఇంటి లోన్ల పేరుతో దళారులతో ప్రచారం చేయించి తక్కువ వడ్డీకి రుణం ఇస్తామంటూ మోసం చేశారని ఆరోపించారు. రనుం తీసుకున్న అనంతరరం కంతులు చెల్లించాలంటూ ఫైనాన్స్ కంపెనీలు వేధిస్తున్నారన్నారు. కంతులను సక్రమంగా చెల్లించకపోతే రైతులన ఇబ్బందులకు గురి చేస్తూన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండ డివిజన్ పరిధిలో పంటలు పండక రైతులు అల్లాడిపోతున్నా రన్నారు. పనులు లేక పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారన్నారు. ఫైనాన్స్ కంపెనీలు రుణాలు మాఫీ చేయాలని లేకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. దస్తగిరి, గోపాల్, రామాంజనేయులు, గోవర్దన్, రాజు, పులికొండ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా పెట్టండి: ఎస్పీ


స్టేషన్ పరిసరాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ

దేవనకొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా పెట్టాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. మంగళవారం దేవనకొండ స్టేషన్‌ను తనిఖీ చేశారు మండలంలో శాంతి భద్రతలపై సీఐ వంశీనాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా పెట్టాలని, సైబల్ ఉచ్చులో పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో అడంగల్ రావడం లేదు

ఆలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో అండంగల్, 1బి రాకపోవడంతో బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదని కురుకుంద గ్రామ రైతులు తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. సర్వేనెం.96, 486, 487ను అన్‌లైన్ చేయలేదన్నారు. గోవిందప్ప, వేంకటేశ్వర రెడ్డి, మల్లికార్జున గౌడ్, సీపీఐ నాయకులు భూపేష్ ఉన్నారు.

రైతులకు సేవలు అందించాలి

ఆలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అగ్రి ల్యాబ్ ద్వారా రైతులకు సేవలందించాలని తెలుగు రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి సూచించారు. మంగళవారం మార్కెట్ యార్డ్‌లోని ల్యాబ్‌ను సందర్శించారు. ల్యాబ్ సేవలపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. మట్టి సమూనా పరీక్షలు ఇక్కడే చేయాలని, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్, జేడీని కోరతామన్నారు. సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. సేవల వివరాలు ప్రదర్శించేలా బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ల్యాబ్ ఇన్‌చార్జి దేవ భూషణం, ఏఈవో హనుమప్ప, టీడీపీ నాయకుడు అరికెర అంజినేయ్య పాల్గొన్నారు.

ఉల్లి సాగుపై అవగాహన పెంచుకోవాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉల్లి సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఉద్యాన అధికారి దస్తగిరి, ఏవో వెంకట్రాముడు సూచించారు. మంగళవారం హోసూరు గ్రామంలో ఉల్లి పంటపై అవగాహన కల్పించారు. మేలురకమైన విత్తనాలతో పాటు హైబ్రిడ్ విత్తనాలను వాడాలన్నారు. బనగాన రాజశేఖర్, శివకుమార్, సిబ్బంది శ్రీనాథ్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

మద్దికెర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడవలి ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీడీవో కొండయ్య, ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వావి అన్నారు. మంగళవారం పాఠశాలలో వంటగది నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పరమేశ్వరప్ప, వీఆర్వో రామాంజనేయులు, పంచాయతీ సలహాదారులు నంది జయరాం, టీడీపీ నాయకులు వేమన్న, ఫీల్డ్ అసిస్టెంట్ శివ ఉన్నారు.

కేంద్ర ఆడిట్ అధికారుల పరిశీలన


ఆలూరులో ఫారంఫండ్‌ను పరిశీలిస్తున్న బృందం

ఆలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధుల వినియోగంపై మంగళవారం మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ కేంద్ర అధికారులు మండలంలో పర్యటించారు. ఉపాధి నిధులతో నిర్మించిన సచివాలయ భవనాలు ఫారం ఫండ్స్ రోడ్లను పరిశీలించారు. సచివాలయం, హెల్త్ క్లినిక్, ఆర్‌బికే కేంద్రాలకు ఎందుకు పేరులు రాయలేదని సీనియర్ అకౌంట్స్ అధికారి రాజేష్ కుమార్ పంచాయతీ రాజ్ అధికారులను ప్రశ్నించారు. ఈ తనిఖీల్లో కేంద్ర బృందం సభ్యులు మొహమ్మద్ చాంద్, ఆలూరు ఎపీడీ పద్మావతి, ఎంపీడీవో సయ్యద్ మహబూబ్ భాష, సీఎల్ఆర్‌సీ కోర్స్ డైరెక్టర్ సురేష్ బాబు, పీఆర్‌జేఈ చౌడ్ రెడ్డి, ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలి మృతి


జి.పద్మావతి(ఫైల్)

దేవనకొండ,ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ పాఠశాల హెచ్ఎం జి.పద్మావతి(62) అనారోగ్యంతో మృతి చెందారు. వివరాల మేరకు.. సోమవారం రాత్రి అనారోగ్యానికి గురికాగా కర్నూలుకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈమె భర్త రఘునాథ్ కుంభమేళకు వెళ్లారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భౌతిక కాయానికి వాల్మీకి చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, రామచంద్రనాయుడు నివాళి అర్పించారు. ఇంకా రెడు నెలల సర్వీసు ఉందని అప్పుడే మృతిచెందడం బాధాకరమని ఎంఈవో తిమ్మరెడ్డి విచారం వ్యక్తం చేశారు.

రైతుల అభివృద్ధికి కూటమి కృషి

- ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు


గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

మద్దికెర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తోందని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. మంగళవారం ఎడవలి గ్రామంలో గోకులం షెడ్డును ప్రారంభించారు. మాజీ సర్పంచ్ ఆకుల ఆనంద్ స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. టీడీపీ వచ్చిన 8 నెలల్లోనే రూ.15 కోట్లతో సీసీ రహదారులు వేశామని తెలిపారు. మద్దికెర నుంచి బురుజులకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఎన్నో పనులు చేశామని, తాలుకాలో 68 చెరువులను హంద్రీనీవా నీటితో నింపుతామన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తం చౌదరి, రాజన్న యాదవ్, ధనుంజయుడు, ఆకుల వేణుగోపాల్, జయరాముడు, బొమ్మనపల్లి ఆంజనేయులు, అశోక్ కుమార్, ఏపీవో నర్సిరెడ్డి, ఎన్.లక్ష్మినారాయణ ఉన్నారు.

సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే కేఈ

పత్తికొండ: మండలంలోని చక్కరాళ్ల పంచాయితీ మజారా గ్రామం కురువలదొడ్డిలో ఎమ్మల్యే శ్యాంబాబు సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ రహదారిని రూ.40 లక్షల ఉపాధి నిధులతో నిర్మించారు. ఎంపీటీసీ రాజు, మునినాయుడు, రమేష్, మదు, పీఆర్ డీఈ శేషయ్య, ఏఈ వెంకటేష్, కాంట్రాక్టర్ దశరధరామిరెడ్డి పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం హోమాలు

పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు



మంత్రాలయంలో హోమం చేస్తున్న పండితులు

మంత్రాలయం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధిలోని యజ్ఞశాలలో లోక కల్యాణార్థం హోమాలు నిర్వహిస్తున్నట్లు మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు అన్నారు. మంగళవారం మాఘ షష్టిని పురస్కరించుకుని నరసింహమంత్రం, నారాయణ వ్రతం, రుగ్వేద, యజుర్వేద పారాయణాలు నిర్వహించారు. హోమగుండంలోకి శ్రీవత్సఆచార్, డోన్ రాఘవేంద్రాచర్, శరత్‌చంద్రాచార్, గౌతమ్‌ఆచార్, శ్రీచాచార్‌లు ధూపదీప, నైవేద్యాలు, సుగంధద్రవ్యాలు వేస్తూ వేదపండితుల మంత్రఘోషాల మధ్య హోమాలు కొనసాగించారు. పీఠాధిపతి హోమాలకు పూర్ణాహుతి చేసి హరతులు ఇచ్చారు. కార్యక్రమంలో రాజాఎస్ అప్రేమేయ ఆచార్, ఏఏఓ మాధవ శెట్టి, మఠంమేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచర్, సురేష్ కోణాపూర్, అనంతపురాణిక్, జేపీస్వామి, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్‌ఆచార్, రవికులకర్ణి, వాజేంద్రాచార్ పాల్గొన్నారు.

మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ, రాఘవరాయుడులకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం మాఘ షష్ఠి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి, రాఘవరాయుడి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు,వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

'కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం గ్రామానికి చెందిన మాల రామకృష్ణ, వారి కుటుంబ సభ్యులు భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ సీఎల్‌సీ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు డీఎస్పీని కోరారు. మంగళవారం డీఎస్పీ ఉపేంద్రబాబును బాధితులతో కలిశారు. బాధితుడు రామకృష్ణ మాట్లాడుతూ తనకు పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణి గ్రామ పరిధిలో 5.50 ఎకరాల భూమి ఉందని, 1960 నుంచి పూర్వీకులు వంశపార్యపర్యంగా జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే ఈ భూమిని కబ్జాచేసేందుకు హనుమాపురం గ్రామానికి చెందిన గోవిందు మరికొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై పెద్దకడుబూరు ఎస్ఐకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అనంతరం ఏపీసీఎల్‌సీ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దళితులకు వంశపార్యంపరంగా వచ్చిన భూమిని కొంత మంది దౌర్జన్యంతో కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. డీఎస్పీ ఈవిషయంపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడలను ప్రోత్సహించాలి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): క్రీడలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని సినీ నిర్మాత అగ్రహారం నాగిరెడ్డి అన్నారు. పట్టణంలోని వీవర్స్ కాలనీమైదానంలో 15 రోజులుగా ఎమ్మిగనూరు టెన్నిస్ బాల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జరిగాయి. చివరి రోజు పోటీల్లో ఎమ్మిగనూరుకు చెందిన యశోద-11 జట్టు విజేతగా నిలిచి రూ.50వేల బహుమతిని కైవసం చేసుకుంది. అలాగే రన్నర్‌గా మహేంద్రఫ్రెండ్స్ జట్టు నిలిచి రూ.30వేల బహుమతి గెలుచుకోగా, తృతీయ స్థానంలో జాలీయంగ్ స్టార్స్ జట్టు నిలిచి రూ.20వేల బహుమతిని కైవసం చేసుకుంది. 15రోజుల పాటు జరిగిన పోటీల్లో 9 జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన జట్లకు అగ్రహారం నాగిరెడ్డి బహుమతులు అందజేశారు. మాజీ కౌన్సిలర్ రంగస్వామిగౌడు, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ భీమేష్, కానిస్టేబుల్ మల్లేష్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు శ్రీనివాసులు, బుల్లెట్ టీం అంజినాయుడు, రంగ, ఉద్దూస్, హాసిఫ్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు

గోనెగండ్ల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు క్రాస్ సమీపంలో పాదయాత్ర ద్వారా శ్రీశైలానికి వెళ్లే శివస్వాముల కోసం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సీఐ గంగాధర్ ప్రారంభించి మాట్లాడారు. పాదయాత్ర భక్తుల కోసం వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఫార్మసిస్టు కృష్ణకుమార్, ఆర్ఎంపీ వైద్యసంఘం నాయకులు నాగేశ్వరరెడ్డి, పులినాయక్, సంతోష్ కుమార్, సురేష్ బాబు, దోమ రమేష్, విమల పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎద్దుల బలప్రదర్శన

కోసిగి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కోసిగిలో రేణుకా ఎల్లమ్మ రథోత్సవం సందర్భంగా కోసిగిలోని 3వ వార్డు బుగేని చెరువు సమీపంలో మంత్రాలయం నియోజకవర్గ స్థాయి గిరక పోటీలు నిర్వహించారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సహకారంతో కోసిగి చెందిన యువ రైతుల ఆధ్వర్యంలో రెండో ఏడాది గిరక పోటీలు మంగళవారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో నాలుగు మండలాల నుంచి సుమారు 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పెద్దకడుబూరు మండలం హెచ్ .మురవణి గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్ వృషభాలు 3,176 అడుగుల దూరం లాగి మొదటి విజేతగా నిలిచింది. వీరికి రూ.20 వేలు నగదును రాఘవేంద్ర రెడ్డి అందజేశారు. హనుమాపురం గోవిందు రైతుకు చెందిన వృషభాలు 3010 అడుగుల దూరం లాగి రెండో విజేతగా నిలిచి రూ.15వేలను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి తనయుడు భీమేష్ అందజేశారు. లక్ష్మారి మోరయ్యగౌడు వృషభాలు 2,816 అడుగల దూరం లాగి రూ.10వేలను కైవసం చేసుకున్నాయి. వీరికి పల్లెపాడు రామిరెడ్డి, నాడిగేని చిన్నతాయనలు నగదును అందజేశారు. కాడయ్య నరసయ్య, అయ్యన్నలకు చెందిన వృషభాలు 2,707 అడుగుల లాగి నాలుగో బహుమతి రూ.5వేలను నాడిగేని అయ్యన్న అందజేశారు. పెండేకల్ బసయ్యకు చెందిన వృషభాలు 2,559 అడుగులు లాగి రూ.3వేలు గెలుచుకున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు తరలివచ్చారు. ఎస్ఐ చంద్రమోహన్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, వక్రాణి వెంకటేశ్, నాడిగేని అయ్యన్న, చిన్న తాయన్న, రణతి కృన్న, హాశేనీ, వీరేష్, లక్ష్మిరెడ్డి,ఈరయ్య, సొట్టయ్య, తాయన్న పాల్గొన్నారు.





పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి

జాతరలో భక్తుల సందడి : కోసిగి రేణుకా ఎల్లమ్మ జాతరలో భక్తుల సందడి నెలకొంది. రెండోరోజూ మంగళవారం భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చిన్న పిల్లలు, యువతీ యువకులు జాతరలో సందడి చేశారు. మహిళలు, బాలికలతో గాజుల అంగళ్లు కళకళలాడాయి. చిన్న పిల్లలు, యువకులు జాయింట్ వీల్స్, రంగుల రాట్నాల వద్ద కేరింతలు కొడుతూ సందడి చేశారు.



జాతరలో భక్తుల సందోహం

మిరప రైతులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే



మిరప పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ

నందవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మిరప రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని హలహర్వి గ్రామంలో మిరప పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎంత వరకు పెట్టుబడి పెట్టారు. ఎంత దిగుబడి వచ్చింది. ఎకరాకు ఎంత మేరకు నష్టం వచ్చిందని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మిగనూరు, గోనెగండ్లలో ఏసీ స్టోరేజ్ గోడౌన్లు ఏర్పాటు చేస్తామన్నారు. దెబ్బతిన్న పంటల వివరాలు పూర్తిగా సేకరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో స్రవంతి, టీడీపీ నాయకులు రైస్‌మిల్ నారాయణ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, కన్వీనర్ డీవీ రాముడు, కాశీంవలీ, గోపాల్, జగన్నాథరెడ్డి, దావీదు, నాగరాజు, మణి, బాపురంశ్రీను, వెంకట్రాముడు, ప్రభుదాసు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం: సబ్ కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

నందవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. మంగళవారం నందవరం, హాలహర్వి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూ సర్వే సమస్యలు గురించి ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. మీ సమస్యలు పరిష్కరించేందుకు వచ్చామని తెలిపారు. నందవరంలో పట్టా విషయంపై విచారించి బాధితునికి న్యాయం చేస్తామన్నారు. అలాగే హలహర్వి గ్రామంలో వివాదస్పదంగా మారిన ఇంటి స్థలాల పట్టాలను పరిశీలించారు. పట్టాలు ఇచ్చింది మాకు కాదని, మా స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకున్నారని, మాకు న్యాయం చేయాలని వారు కోరారు. ఆయన వెంట తహసీల్దారు శ్రీనివాసులు, డీటీలు మహేష్, శశి, ఆర్ఐ సుబ్బారెడ్డి, సర్వేయర్ అక్బర్‌బాషా, ముగతి శేఖర్, ప్రవీణ్, వీఆర్వో నతానీయేలు ఉన్నారు.

విద్యార్థులను పాఠశాలకు తీసుకురావాలి

మంత్రాలయం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలుగల పిల్లలను పాఠశాలకు తీసుకురావాల్సిన బాధ్యత ఆయా, ఐఆర్‌టీలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులదేనని ఎంఈఓ రాఘన్న అన్నారు. మంగళవారం మంత్రాలయంలో నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష భవిత కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, ఆర్ఐటీల బోధన, ఆయా పనితీరును పరిశీలించారు. ఈ కేంద్రంలో 20 మంది విద్యార్థులు హాజరు పట్టికలో ఉండగా చాలామంది పిల్లలు బడికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఐఆర్‌టీలు కళ్యాణి, శివప్రసాద్, ఆయా బీమక్కలు ఉన్నారు.

హెచ్‌ఎంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

మంత్రాలయం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం హంపయ్యపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షహీద్ ఆఫ్రీదీ, ఆర్‌యూఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రఘునాథ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో విద్యార్థులతో పనులు అన్న శీర్షిక ప్రచురితమైంది. స్పందించిన విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కోట్లు ఖర్చుపెట్టి సౌకర్యాలు కల్పిస్తే, ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేస్తూ మంత్రాలయం హెచ్ఎం హంపయ్య మాత్రం పనులు చేయించుకోవడం సిగ్గుచేటన్నారు. నాయకులు పవన్, మనోహర్, బాబు,అరుణాచారి, వీరేష్ పాల్గొన్నారు.

బోధనాభ్యాసాన్ని మెరుగు పరుచుకోవాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బోధనాభ్యాసాన్ని ప్రతి అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు మెరుగు పరుచుకోవాలని సమగ్ర శిక్షణ అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మోడల్ స్కూల్‌లో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ శిక్షణను అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో రామాంజినేయులు, నీలకంఠ, ప్రిన్సిపాల్ షహనా పర్విన్, పుల్లన్న, నారాయణరావు, డీఆర్పీలు షఫీఉల్లా, గోవర్ధన్‌నాయుడు, ఎల్లనాగరాజు పాల్గొన్నారు.

పాఠాలు బోధించిన ఎంపీ

కళాశాల వార్షికోత్సవంలో పాల్గొన్న బస్తిపాటి నాగరాజు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీ బస్తిపాటి నాగరాజు లెక్చరర్‌గా మారి కాసేపు విద్యార్థినులకు కెమిస్ట్రి పాఠాలు బోధించారు. మంగళవారం కళాశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరై వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గతంలో తాను పాఠాలు బోధించిన కళాశాలలోని కెమిస్ట్రీ తరగతి గదిని ఆయన సందర్శించి కొద్దిసేపు విద్యార్థినిలకు కెమిస్ట్రి పాఠాలు బోధించి గత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అనంతరం ఆయన సభలో మాట్లాడుతూ తాను గతంలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేసిన కళాశాలకు ఎంపీ హోదాలో రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. లెక్చరర్‌గా ఉద్యోగం మానేసిన తర్వాత ఏడాదిపాటు చాలా బాధపడ్డానన్నారు. ఇంటర్‌లో కెమిస్ట్రి సబ్జెట్‌లో ఫెయిల్ అయిన తాను కెమిస్ట్రి సబ్జెట్‌పై ఇష్టతను పెంచుకొని కష్టపడి చదివి కెమిస్ట్రి లెక్చరర్ అయ్యానన్నారు. విద్యార్థినులు కూడా క్రమ శిక్షణ అలవరుచుకొని కష్టపడి చదివి ఎదిగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పాఠాలు బోధిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

ఇంటి స్థలానికి దరఖాస్తు చేసుకోండి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కౌతాళం, కోసిగి, పెద్దకడుబూరు, మంత్రాలయం మండలాల్లో అర్హులైన ప్రతి పేద లబ్ధిదారుడు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఇచ్చే మూడు సెంట్ల పట్టా కోసం గ్రామ వీఆర్వోలకు, తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్ కార్డు, రెండు ఫోటోలు మొబైల్ నెంబర్ ఇవ్వాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలకు దూరంగా, శ్మశానాలకు దగ్గరగా వర్షంవస్తే ముంపుకు గురయ్యే ప్రాంతాల్లో ఇంటి పట్టాలు ఇచ్చారని, వాటిని రద్దు చేసి వేరే చోట అందజేస్తామని తెలిపారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి: సీఐ

గోనెగండ్ల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ గంగాధర్ అన్నారు. మంగళవారం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో నేను సైబర్ స్మార్ట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కువగా జరుగుతున్న సైబర్ నేరాల గురించి వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపే వీడియోను ప్రదర్శించారు. ఎవరైన సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 టోల్ ఫ్రీనెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈవ్‌టీజింగ్ కు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పదిమంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక కస్తూరి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజీఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీ డైరెక్టర్ బాలకోటిరెడ్డి సహకారంతో రోటరీక్లబ్ ఎమ్మిగనూరు అధ్యక్ష, కార్యదర్శులు నటరాజరెడ్డి, సుధాకర్‌రావు, పద్మనాభరెడ్డి, కేఆర్ నరసింహారెడ్డిలు మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. వారు మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆధ్వర్యంలొ ఎమ్మిగనూరు పట్టణ ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు బజారిరెడ్డి, శివకుమార్, కేశవరెడ్డి, బీరప్ప, నాగరాజు, పాఠశాల అధినేత రాజు, షఫీఉల్లాలు పాల్గొన్నారు.

నేడు రచ్చమర్రిలో దేవర

మంత్రాలయం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో వెలసిన బంగారమ్మ, దేవమ్మ గ్రామ దేవర ఉత్సవాలు మంగళవారం మధ్యరాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం మహిళలు పెద్ద ఎత్తున బోనాల నైవేద్యాలతో బంగారమ్మ, దేవమ్మలకు ఊరేగింపుగా వచ్చి నైవేద్యాలు సమర్పించనున్నారు. ఈ వేడుకల కోసం దేవాలయాన్ని రచ్చుమర్రి గ్రామ యువకులతో తయారు చేసిన భారీ గజమాలను అమ్మవారికి అలంకరణ చేశారు. గ్రామ దేవర ఉత్సవ కమిటీ నిర్వాహకులు జెట్టి నరసింహులు, యాగంటి వీరేష్, చింతల కరెప్ప, గొర్రెల హనుమంతు, బొజ్జప్ప, కడితట్ల వెంకప్ప, మూలింటి హనుమంతప్ప, అయ్యన్న, అంజనేయ, ముకురప్పల ఆధ్వర్యంలో గ్రామమంతా విద్యుద్దీపాలకరణతో ముస్తాబు చేశారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు, మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు విజయకుమార్, శివాంజల్ 30 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

విదేశీ పెట్టుబడుల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీలో వందశాతం విదేశీ పెట్టుబడుల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ తాలుకా కార్యదర్శి రాముడు, ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం నాయకులు తిమ్మప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ఏజెంట్లతో కలిసి ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో ఎల్ఐసీ సంస్థలో కోట్లాది మంది ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగ కార్మికులు బీమా రూపంలో పెట్టుబడులు పెట్టారన్నారు. ఇందులో విదేశీపెట్టుబడులను పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించడం దారుణమన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో ఏజెంట్ల సంఘం నాయకులు రామాచారి, ఉరుకుందప్ప, వీరేష్, బాషా, సీఐటీయూ నాయకులు రాజు, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు ప్రారంభం

గోనెగండ్ల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటెడుదిన్నె గ్రామంలో మంగళవారం రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలకు పలు ప్రాంతాల నుంచి 30 టీమ్‌లు హాజరయ్యాయి. మాజీ ఎంపీపీ మాట్లాడుతూ ఈ పోటీల వల్ల రైతుల మధ్య స్నేహబంధాలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌హమ్మద్, మార్కెట్ యార్డు మజీ చైర్మన్ మన్సూర్, గ్రామ సర్పంచ్ కేశవరెడ్డి, మాజీసర్పంచ్ ఉరుకుందరెడ్డి, దస్తగిరి, నాగరాజు, గోవిందు పాల్గొన్నారు.

మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

కౌతాళం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మిరప పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న డిమాండ్ చేశారు. కౌతాళం తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ మండలంలో 9 వేల ఎకరాల్లో మిరపను సాగు చేశారని, పంట కోసం ఎకరాకు సుమారు రూ.లక్ష పెట్టుబడి పెట్టారన్నారు. అయితే మార్కెట్‌లో క్వింటం రూ. 10వేలకు మించి పోవడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాయకులు ఉలిగయ్య, హనుమంతు, వీరేష్ పాల్గొన్నారు.

బీడీఎస్ జాతీయ అధ్యక్షుడిగా చంద్రశేఖర్

కోసిగి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కోసిగికి చెందిన తపాలా ఉద్యోగి బి. చంద్రశేఖర్ జాతీయ నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారతదేశంలోని గ్రామీణ తపాల ఉద్యోగుల జాతీయ సమావేశాన్ని 16వ ఆలిండియా సమావేశంలో మధురలోని కేశవధామ్‌లో నిర్వహించిన జాతీయ సమావేశంలో భాగంగా కోసిగి చెందిన బి.చంద్రశేఖర్‌ను బీడీఎస్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ బీడీఎస్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జీఎంఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్ సింగ్, పోస్టుమాన్ ఎంటీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కాల్షిరాం స్వామి, కడప డివిజన్ కార్యదర్శి శోభన్‌బాబు పాల్గొన్నారు.



ఎల్లెల్సీలో పెరిగిన నీటి మట్టం

గోనెగండ్ల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తుంగ భద్రడ్యాం నుంచి ఎల్లెల్సీ కాలువకు నీటి విడుదల పెరిగింది. మంగళవారం గోనెగండ్ల సెక్షన్‌కు 117 క్యూసెక్కుల నీరు చేరింది. దీంతో గోనెగండ్ల, కోడుమూరు ఎల్లెల్సీ ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం గోనెగండ్ల సెక్షన్‌కు నీటిని విడుదల నిలిచిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందారు. మంగళవారం ఉదయం గోనెగండ్ల సెక్షన్‌కు తుంగభద్రనీరు విడుదల పెరగడంతో గోనెగండ్ల, కోడుమూరు ఆయకట్టు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గత పది రోజులుగా సాగు నీరు కోడుమూరు సెక్షన్‌కు అందకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. ప్రస్తుతం ఎల్లెల్సీ కాలువకు విడుదల అయిన 117 క్యూసెక్కుల నీరు గోనెగండ్ల, కోడుమూరు సెక్షన్‌కు సరిపోవు. కాబట్టి విడుదల అయిన నీటిలో కోడుమూరుకు 80 క్యూసెక్కులు విడుదల చేసి మిగిలిన వాటలో ఉన్న 37 క్యూసెక్కుల నీటిని గోనెగండ్ల సెక్షన్ భూములకు మళ్లించారు. అయినప్పటికి కోడుమూరు పంట భూములకు విడుదల అయిన ఎల్లెల్సీ నీరు ఎంత మత్రం సరిపోవని భావించిన ఇరిగేషన్ అధికారులు గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి మరో 70 క్యూసెక్కుల నీటిని కోడుమూరు ఎల్లెల్సీ ఆయకట్టు భూములకు మళ్లించారు. దీంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.



గోనెగండ్ల సెక్షన్ ఎల్లెల్సీలో పెరిగిన నీటి మట్టం